
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 27.0
కనిష్ఠం 15.4
ANDHRAJYOTHY

నల్లగొండ
5
బుధవారం 10 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	576.80 (273.8166)	20,167	20,167
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.64 (4.37)	456.82	333.24
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.554 (43.5481)	900	4,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



మొదటి విడత ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి
- ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో ముగ్గురు పోలింగ్ సిబ్బంది
- మొదటి దశలో 294 పంచాయతీలు, 2,870 వార్డులు
- 1,680 మందితో పోలీస్ బందోబస్తు
- అన్ని మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు
- నేడు పోలింగ్ కేంద్రాలకు తరలనున్న సిబ్బంది

జిల్లాలో మొదటివిడత పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. 11న తేదీ పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన అధికారులు, ఉద్యోగులను ఇప్పటికే కేటాయించగా, పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. ప్రతీ మండల కేంద్రంలో ఒక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి బుధవారం అక్కడి నుంచే అన్ని పోలింగ్ బూత్‌ల వద్దకు సిబ్బంది, పోలీసులు సహా పోలింగ్ సామగ్రిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పర్యవేక్షించారు. (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

జిల్లాలో నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 14 మండలాల్లోని 294 గ్రామ పంచాయతీలు, 2,870వార్డు స్థానాలకు తొలిదశలో ఈనెల 11న పోలింగ్ జరగనుంది. ప్రతీ పంచాయతీలో ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ అభ్యర్థికి గులాబీ రంగు బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యులకు తెల్లరంగు బ్యాలెట్ పత్రాన్ని నిర్ధారించి అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు ముద్రించి సిద్ధం చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఒక పోలింగ్ అధికారి, మరో ఇద్దరు సహాయ పోలింగ్ అధికారులను నియమించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ముగ్గురు సిబ్బంది విధుల్లో ఉంటారు. గ్రామాల్లోని వీర్ఏలు, గ్రామపంచాయతీ అధికారులు వీరికి సహాయకంగా ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. మొత్తంగా జిల్లాలో మొదటి విడతలో 7,892 మంది పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించారు. వీరితో పాటు మరో 10శాతం మందిని రిజర్వ్‌లో ఉంచారు. ప్రతీ మండలాన్ని ఒక జోన్‌గా మార్చి జోనల్ అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోల నేతృత్వంలో ఈ జోనల్ బృందాలు పోలింగ్‌ను పర్యవేక్షిస్తాయి. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్‌కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణపై మంగళవారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల పరిశీలకురాలు, సీనియర్ ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణఅమిత్, తదితరులు ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే అన్ని గ్రామాల్లో ఎలాంటి అలజడులు, ఘర్షణలు చెలరేగకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు ఎస్పీ శరత్‌చంద్రపవార్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎస్పీతో పాటు, ఒక ఏఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 23మంది సీఐలు, 84మంది ఎస్ఐలు, 1,576 మంది కానిస్టేబుళ్లను ఎన్నికల విధులు కేటాయించారు. వీరందరికీ ఎన్నికల విధులపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. జిల్లాలో 442 సమస్యాత్మక గ్రామపంచాయతీలను గుర్తించారు. ఈ ప్రాంతాలలో ప్రతీ పోలింగ్‌స్టేషన్ వద్ద అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్ పార్టీలను అదనంగా నియమించారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు, పాత

మిగతా 8వ పేజీలో...

మూడో విడతలో 38 ఏకగ్రీవం

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత జరిగే దేవరకొండ డివిజన్‌లో మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికాగా, 38 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. మూడో విడత పోలింగ్ ఈనెల 17వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తారు. అదేరోజు ఓట్లను లెక్కించి విజేతను ప్రకటించడంతో పాటు ఉపసర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. దేవరకొండ డివిజన్‌లో మొత్తం 269 సర్పంచ్ స్థానాలకు, 2,206 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవ పంచాయతీలు మినహా మిగిలిన సర్పంచ్ స్థానాలకు, వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. డివిజన్‌లో మొత్తం తొమ్మిది మండలాలు ఉండగా, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గుడిపల్లి మినహా మిగతా ఎనిమిది మండలాల్లో మొత్తం 38 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

మండలం	ఏకగ్రీవ పంచాయతీలు
దేవరకొండ	6
చందంపేట	7
నేరడుగొమ్ము	2
డిండి	4
కొండమల్లేపల్లి	7
గుర్రంపోడు	5
పీఏపల్లి	5
చింతపల్లి	2
మొత్తం	38



మొదలైన పంపకాలు

- ముగిసిన ప్రచారం
- కొనసాగుతున్న మద్యం పంపిణీ
- నగదు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- అభ్యర్థుల గెలుపునకు ఆర్థిక సహాయం అందిస్తున్న పెద్దనేతలు



తొలిదశ ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో అధికారిక ప్రచారానికి మంగళవారం సాయంత్రం తెరపడింది. కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ మంగళవారం రాత్రి నుంచే గ్రామాల్లో జోరందుకుంది. అంతేగాక తాయిలాల పంపిణీ సైతం మొదలైంది. ఇప్పటికే గ్రామాల్లో ఓటర్లకు మద్యం పంపిణీ రెండు రోజులుగా సాగుతున్నట్టు వినికిడి.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

గ్రామాల్లో ఇప్పటివరకు జరిగిన ప్రచార సరళికి అనుగుణంగా అభ్యర్థుల పరిస్థితి, ఓటర్ల మనోగతాన్ని అంచనావేసిన కీలక నేతలు మంత్రి, ఎమ్మెల్యేలు, మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేలతో చర్చించి పోల్ మేనేజ్‌మెంట్ ఎలా నిర్వహించాలనే దానిపై కసరత్తు చేశారు. ప్రధానంగా పోటీ బలంగా ఉందని అంచనావేసిన గ్రామాల్లో, అదేవిధంగా పార్టీ నుంచే తిరుగుబాటు అభ్యర్థులు ఉన్న చోట్ల ఎమ్మెల్యేలు, కీలక నేతలు ప్రత్యేకంగా గెలుపు వ్యూహాలు అమలు చేస్తున్నారు. పార్టీ, వర్గం అభ్యర్థులను గెలిపించుకునేందుకు అన్నినియోజకవర్గాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది.

తాయిలాల పంపిణీకి రంగం సిద్ధం

ఉమ్మడి జిల్లాలో మొదటి దశలో జరిగే 589 గ్రామపంచాయతీలు, 5,080 వార్డు స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఈ గ్రామాల్లో మంగళవారం సాయంత్రానికి అధికారికంగా ప్రచారం ముగించారు. అయితే కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ మాత్రం మంగళవారం సాయంత్రం నుంచి మొదలైంది. అధికార కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ మద్దతుదారులు, ఏ పార్టీ మద్దతు లేకుండా బరిలో దిగిన స్వతంత్రులు, కాంగ్రెస్ రెబెల్స్ సైతం పోటాపోటీగా ఖర్చు చేస్తున్నారు. పోటాపోటీ ఉన్న గ్రామాల్లో ఇప్పటికే ఓటర్లకు మూడు దఫాలు, సాధారణ పోటీ ఉన్న చోట్ల రెండు దఫాలుగా మద్యం పంపిణీ జరిగింది. ఓటరుకు క్వార్టర్ విస్కీ లేదా, ఒక బీరు సీసా చొప్పున ఇప్పటికే మూడు దఫాలుగా పంపిణీచేశారు. పోటాపోటీ ఉన్న గ్రామాల్లో రోజూ మద్యం పంపిణీ చేసినట్టు సమాచారం. వలస ఓటర్లను గుర్తించి ఇప్పటికే వారి వద్దకు ప్రతినిధులను పంపి ఓటుకు వచ్చివెళ్లేందుకు వాహన ఖర్చులు, పోలింగ్ రోజున భోజనాల ఖర్చులతో పాటు, ఓటుకు రూ.1,000 వరకు ఇస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా మునుగోడు, నకిరేకల్, ఆలేరు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని వలస ఓటర్లకు ఈ రకమైన తాయిలాలు ఇస్తున్నట్లు...

- మిగతా 8వ పేజీలో...



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాణి కుముదిని, పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేయాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పోలింగ్ రోజున 9, 11, 1 గంటకు పంపించే పోలింగ్ శాతాన్ని సరైన సమయంలో పంపించేందుకు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, ఫలితాలను ఎప్పటికప్పుడు టీపోల్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు మరోసారి సమీక్షించుకోవాలని, పోలింగ్ బృందాలకు అందజేసే ఫారాలు, వెబ్‌కాస్టింగ్, ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఇచ్చే పోలింగ్‌శాతం, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల ప్రచారం ముగింపు, మద్యంపై నిషేధం, గుర్తింపు కార్డులు, తదితర విషయాలను సమీక్షించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలోని రెండు డివిజన్లలో 14 మండలాల్లో మొదటి విడత ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు వివరించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించామని, పోలింగ్ సిబ్బంది, పార్కింగ్, సిబ్బందికి భోజనం, వసతి సౌకర్యాలు అన్నింటినీ ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎక్కడా ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, జె.శ్రీనివాస్, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పూర్తయ్యే వరకు నీటి విడుదల

నల్లగొండ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ కింద యాసంగి పంటలు పూర్తయ్యే వరకు నీరు విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ ఎస్ఈ బద్రు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎమ్మార్పీ కింద హైలెవల్, లోలెవల్ కాల్వలకు ఈ సారి పంటలకు 120 రోజుల పాటు ఆయకట్టు షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. హైలెవల్ కింద 2.20లక్షల ఎకరాలు ఉండగా, లోలెవల్ కింద 45వేల ఎకరాలకు ఈ ఆయకట్టు కింద నీరు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆరు తడి పంటలు వేసుకొని నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. నీటి పారుదల శాఖ అధికారులు కాల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. నీటి విడుదల సమయంలో కాల్వలకు అక్రమంగా గండ్లు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎమ్మార్పీ కింద ఆరుతడి పంటలు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ నెల 10 నుంచి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతీ ఉద్యోగి నిబంధనలు పాటించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, ప్రతీ ఉద్యోగి నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సామగ్రి పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతీ కవర్ సీల్, సంతకాలపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. సామగ్రి పంపిణీ సమయంలో అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక డెస్కులు, ఎక్కడా అలసత్వం, అయోమయం తలెత్తకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలింగ్ సిబ్బందికి తాగునీరు, విశ్రాంతి గదులు, వైద్య సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోని కౌంటర్లు, ఎన్నికల సామగ్రి సరఫరా వ్యవస్థ, రిసెప్షన్ రూమ్ కార్యకలాపాలను పరిశీలించారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించిన మూడో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్రా లక్ష్మి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో నిర్వహించారు. నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. చండూరు, చిట్యాల, గట్టుప్పల్, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మర్రిగూడ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, నాంపల్లి, నార్కెట్‌పల్లి, శాలిగౌరారం, తిప్పర్తి మండలాల్లోని 2,870 పోలింగ్ కేంద్రాల్లో మొదటి విడత ఎన్నికలు జరగనున్నాయి. అందుకు పీవో, వోపీవో, రెండో వోపీవో మొత్తం 7,892 మందిని విధులు నిర్వహించే విధంగా ర్యాండమైజేషన్ నిర్వహించారు. అందులో పీవోలు 3,444, వోపీవోలు 4,448 మందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు.



కనగల్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, కనగల్): జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్నికల సామగ్రిని ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూటరీ కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు వరుస క్రమంలో సిబ్బందిని, సామగ్రిని తరలించాలన్నారు. అధికారులు ఓటరు జాబితా, బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ బాక్స్‌లను సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సరఫరా, పార్కింగ్, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు భోజన వసతి కల్పించాలన్నారు. పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్‌లో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నారాయణ్‌అమిత్, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, దుర్గారావు, ఎస్‌బీసీ అధికారులు ప్రేమ్, తహసీల్దార్లు కె.పరశురాం, పద్మ, ఎంపీడీవోలు యాకూబ్‌నాయక్, వేదరక్షిత, ఎంఈవో పద్మ, ఎంపీవో సతీష్, తదితరులు ఉన్నారు.

సోనియాగాంధీతోనే తెలంగాణ సాకారం



సోనియా జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత

నల్లగొండ, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల నెరవేర్చి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తెలంగాణ ప్రజల హృదయాల్లో దేవతగా నిలిచారని డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్‌నేత అన్నారు. సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం బలిదానం చేసిన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల వారసత్వాన్ని నిలబెట్టిన నిజమైన దేశభక్తురాలు సోనియాగాంధీ అని కొనియాడారు. దేశం కోసం, దేశాభివృద్ధి కోసం, ప్రజల కోసం పనిచేస్తున్న సోనియాగాంధీతో పాటు రాహుల్‌గాంధీలను బీజేపీ ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో అధికారంలోకి తీసుకొచ్చి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సన్నబియ్యం, రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రుణమాఫీ, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసి దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బోడ స్వామి, కిన్నెర శ్రీను, అంబటి సోమన్న, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ముంతాజ్ ఆలీ, వెంకటయ్య, రమణయ్య, కన్నరావు, శివ, పరమేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఏర్పాటు




దీక్షా విజయ్ దివస్‌లో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రవీంద్రకుమార్

దేవరకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం అంటేనే కేసీఆర్ అని, కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండలో దీక్ష విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 9 తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించిన రోజు అని, కేసీఆర్ నవంబరు 29న చేపట్టిన అమరణ దీక్ష ఫలితమే డిసెంబరు 9నాటి తెలంగాణ ప్రకటన అని అన్నారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి కొట్లాడకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. 24 గంటల విద్యుత్, రైతు బీమా, రైతుబంధు, ఇంటింటికీ భగీరథనీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ దేవరకొండ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, వల్లపురెడ్డి, గాజుల ఆంజనేయులు, ముత్యపురావు, జానిబాబా, రిజ్వాన్, ఖాదర్, లక్ష్మణ్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణకు 71 వసంతాలు

● స్వదేశీ ఇంజనీర్ల కలకు ప్రతిరూపం నాగార్జున సాగర్

దేశంలోనే మానవ నిర్మిత కట్టడాల్లో మొదటిది. రెండు రాష్ట్రాల అన్నపూర్ణ. ఆధునిక దేవాలయంగా ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నేడు 71వ వసంతంలోకి అడుగిడుతోంది. భారతదేశ ఇంజనీర్ల ప్రతిభకు, ప్రజల శ్రమశక్తికి నిదర్శనం ఈ ప్రాజెక్ట్ పనులను నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1955, డిసెంబరు 10న ప్రారంభించారు. (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



సాగర్ డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాటి ప్రధాని నెహ్రూ

కృష్ణా జిల్లా జగ్గయ్యపేట సమీపంలో ముక్త్యాల కోట కృష్ణా నదికి ఎత్తయిన ప్రాంతంలో ఉంటుంది. అక్కడి నుంచి నదీ ప్రవాహాన్ని వీక్షించవచ్చు. ఓ రోజు నదీ ప్రవాహాన్ని వీక్షిస్తున్న ముక్త్యాల రాజు రాజారామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్ నీరంతా వృథా పోకుండా ఓ ఆనకట్ట కట్టాలని భావించారు. వెంటనే 1908లో కర్నల్ ఎల్లిస్, కర్నల్ సీటీ మార్లింగ్స్ అనే బ్రిటిష్ ఇంజనీర్లను రప్పించారు. విజయవాడ నుంచి 40 మైళ్ల దూరంలోని పులిచింతల వద్ద ఒక ఆనకట్ట నిర్మాణానికి వీలుందని వారు ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చారు. కొంతకాలం తర్వాత పెద్ద ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని రాజావారు భావించి ఆయనే స్వయంగా నల్లమల అడవులలో స్థలసేకరణకు బయలుదేరారు. రాజా వారికి కేఎల్.రావు, వావిలాల గోపాలకృష్ణయ్య, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు సహకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసల తర్వాత ప్రస్తుతం ప్రాజెక్టు కట్టిన ప్రదేశాన్ని కనుగొన్నారు. అక్కడ ప్రాజెక్ట్ నిర్మాణానికి మైసూర్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు నర్సింహయ్యను, ఇంజనీరు గోపాలచార్యులతో రిపోర్టులను చేయించారు. తెలంగాణలో 10 లక్షల ఎకరాలు, ఆంధ్రలో 18లక్షల ఎకరాలు సాగయ్యేలా నివేదిక తయారుచేశారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి మద్రాస్ ప్రభుత్వం అంగీకరించలేదు. శ్రీశైలంపైన కృష్ణా, పెన్నార్ ప్రాజెక్టును నిర్మించి నీటిని మద్రాసుకు తరలించే ప్రయత్నంలో అక్కడి ప్రభుత్వం ఉంది.

ప్రజల నుంచే ఉద్యమం

మద్రాసు ప్రభుత్వం ప్రాజెక్టుకు సమ్మతించకపోవడంతో రాజావారు ప్రజల నుంచి ఉద్యమం తీసుకువచ్చారు. కృష్ణా తీరవాసులు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి దానికి చల్లపల్లి రాజా శివప్రసాద్‌ను అధ్యక్షుడిని చేశారు. అప్పుడు ప్రజలకు తలా పావుల ఇచ్చి కేంద్ర ప్రభుత్వానికి టెలిగ్రామ్స్ పంపారు. ఆ టెలిగ్రామ్స్ అన్ని గదిలో నిండిపోయాయి. దీంతో ఈ విషయంపై వావిలాల గోపాలకృష్ణయ్య ఢిల్లీ వెళ్లి ప్లానింగ్ కమిషన్ మంత్రి గుల్జారీలాల్ నందను కలిసి ఒప్పించడంతో కేంద్ర ప్రభుత్వం ఖోస్లా కమిటీని నియమించింది.

100 ఆర్చీలు.. 60 కార్లు ఏర్పాటు చేసి

ఖోస్లా వస్తున్నాడని తెలుసుకున్న రాజావారు అప్పుడే విజయవాడ నుంచి 260 మైళ్ల పొడవున 100 ఆర్చీలు పెట్టి స్వాగత ద్వారాలు, 60 కార్లు ఏర్పాటుచేశారు. ఖోస్లా స్థల పరిశీలనకు ఇబ్బందులు లేకుండా తలగుడ్ల అనంతయ్య అనే వ్యక్తి బెల్లకొండపాలెం గ్రామస్థుల సహకారంతో అడవిలో జీపు పోయే దారిని 14 మైళ్లు తయారు చేయించారు. అప్పుడు ఖోస్లా నందికొండ ప్రాంతాన్ని పరిశీలించి ఇది భగవంతుడు మీకు ఇచ్చిన వరం అని ప్రశంసించాడు. ఆ స్థలాన్ని, లోయలను చూసి ఖోస్లా ముగ్ధులై, ప్రాజెక్టుకు అనుకూలంగా నివేదిక ఇచ్చారు. దీన్ని అప్పటి గవర్నర్ త్రివేది నెహ్రూతో చర్చించి ఆమోదించారు. 1954 డిసెంబరు 17న గవర్నర్ నందికొండ ప్రాజెక్టు నిర్మాణ నిర్ణయాన్ని ప్రకటించారు. ఆంధ్ర, హైదరాబాద్ ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణానికి చేతులు కలిపాయి. 1955 డిసెంబరు 10న ప్రాజెక్టుకు అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. 1956లో పనులు ప్రారంభించగా, 1967 ఆగస్టు 4న ప్రధాని ఇందిరాగాంధీ(నిర్మాణం పూర్తికాక ముందే) కాల్వలకు నీటి విడుదల చేశారు. 1974లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది.



ప్రాజెక్ట్ ప్రత్యేకతలు

- భారతదేశం నిర్మించిన మొట్టమొదటి ఆనకట్ట ఇది.
- ప్రపంచంలోని మానవ నిర్మిత జలాశయాల్లో మూడోది.
- అధిక నీటి విడుదల సామర్థ్యం కలిగిన కాల్వల్లో కుడి కాల్వ ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉంది. ఎత్తులో ప్రపంచంలోని ప్రాజెక్టుల్లో సాగర్‌ది ఏడో స్థానం.
- ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రముఖ ఇంజనీర్లు: అలీ నవాజ్ జంగ్, జఫర్ ఆలీ, ఏపీ. రంగనాథస్వామి.
- పరివాహక ప్రాంతం: 83,083 చదరపు మైళ్లు

అరచేతిలో ప్రచార అస్త్రం

» కాలం చెల్లిన గోడ రాతలు, బ్యానర్లు
» సోషల్ మీడియాకు పెరిగిన ప్రాధాన్యం
» ఎవరికి వారు వేర్వేరుగా వాట్సాప్ గ్రూపులు
» పంచాయతీ ఎన్నికల్లో 'మొబైల్ ఫోన్' కీలకపాత్ర



(ఆంధ్రజ్యోతి-నిడమనూరు): ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే తెల్లటి గోడలు అభ్యర్థుల పేర్లు, గుర్తులు, నినాదాలతో నిండిపోయేవి. క్రమంగా ఆ పద్ధతి కనుమరుగైంది. ఆ తర్వాత బ్యానర్లు వచ్చాయి. తెల్లటి వస్త్రాలపై నీలిరంగుతో రాసిన బ్యానర్లను వీధుల్లో, ప్రధాన కూడళ్లలో కట్టేవారు. ఆ తర్వాత అభ్యర్థుల చిత్రాలు, గుర్తులతో స్టిక్కర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలు వచ్చాయి. ఇంటింటికి వెళ్లి తలుపులు, గోడలపై స్టిక్కర్లు అతికించేవారు. ఆ పద్ధతి కొంతమేరకు ఇప్పటికీ కొనసాగుతున్నా, ప్రస్తుతం సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కుతుండటంతో సోషల్ మీడియాకు ప్రాధాన్యం పెరిగింది. వాట్సాప్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటితో ప్రతీ సమాచారాన్ని క్షణాల్లో చాలామందికి ఒక్క క్లిక్‌తో చేరవేస్తున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియానే ట్రెండింగ్ అవుతోంది. అందరి వద్ద సెల్‌ఫోన్లు ఉండటంతో అది అభ్యర్థులకు ప్రచారఅస్త్రంగా మారింది. దీంతో సోషల్‌మీడియా వేదికగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందుకోసం పార్టీలు, అభ్యర్థులు ప్రత్యేక వాట్సాప్‌గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో గ్రామాలకు సంబంధించిన వాట్సాప్ గ్రూపులు అనేకం రూపొందాయి. ఫ్రెండ్స్, యూత్, క్లాస్‌మేట్స్, గ్రామస్థులు ఇలా అనేక పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. సోషల్ మీడియాలో తమకు సంబంధించిన ప్రచారాన్ని నిర్వహించేందుకు కొందరు కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో గ్రూపులో నాలుగైదు వందలమంది వరకు ఉంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేవరకు సామాజిక మాధ్యమాలనే ప్రచారానికి వాడుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఓటర్లు స్థానికంగా ఉన్నా, ఇతర ఊర్లలో ఉన్నా ప్రచార సమాచారం వాట్సాప్ గ్రూపుల ద్వారా వారికి చేరుతుంది. ఓటర్ల ఫోన్ నెంబర్లు తీసుకొని మరీ వారికి సమాచారం అందిస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి చేసే మంచి పనులు వివరించడంతో పాటు ప్రచార కార్యక్రమాలను సైతం వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతూ ఎప్పటికప్పుడు సమాచారం చేర వేస్తున్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో చర్చోపచర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నాయి. ఆయా గ్రూపుల్లో అభ్యర్థులకు అనుకూలంగా కొందరు, ప్రతికూలంగా కొందరు కామెంట్లు పెడుతున్నారు. అలాగే పార్టీల మద్దతు ఆశించి భంగపడ్డవారు, వారి అనుచరులు, అవకాశం దక్కినవారు, మద్దతుదారుల నడుమ పోటాపోటీగా సోషల్ వార్ కొనసాగుతోంది.

ఒక్కో ఊర్లో అనేక గ్రూపులు

ఇప్పుడు ఎలాంటి సమాచారమైనా వాట్సాప్‌తో క్షణాల్లో ఇట్టే తెలిసిపోతుంది. దీంతో ఒక్కో ఊర్లో అనేక వాట్సాప్ గ్రూపులు ఉన్నాయి. వివిధ పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న ఓ అభ్యర్థి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. అందులో దాదాపు 1000 మంది ఉన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో ఉంటున్న తమ గ్రామానికి చెందిన ఓటర్ల ఫోన్ నెంబర్లు సేకరించి గ్రూపులో చేర్చాడు. తన ప్యానల్ తరఫున పోటీ చేస్తున్న వార్డు సభ్యుల వివరాలు, వారికి కేటాయించిన గుర్తులు, తనకు వచ్చిన గుర్తును కూడా వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఓటర్లకు చేరవేస్తున్నాడు. ప్రచారానికి సంబంధించిన వివరాలు కూడా గ్రూపు ద్వారా తెలియజేస్తున్నాడు. ఒక్క క్లిక్‌తో 1000 మందికి సమాచారం అందుతుండటంతో ఇంతకు మించిన ప్రచార అస్త్రం లేదని భావిస్తున్నారు. ఇదే తరహాలో అన్ని పార్టీల నాయకులు సోషల్‌మీడియాను వినియోగించుకుంటున్నారు.

దివ్యమైన ఆలోచన..
ప్రజాస్వామ్యానికి రక్షణ



(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

వైకల్యం ఓటు హక్కు వినియోగానికి అడ్డుకాదని సూర్యాపేట జిల్లా మఠంపల్లి లోని దివ్యాంగులు నిరూపిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా బాగుండి చదువుకుని సమాజం గురించి అవగాహన ఉన్న వారే చాలామంది పోలింగ్ రోజు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులను చూస్తున్నాం. శారీరక వైకల్యం ఉన్న దివ్యాంగులు మాత్రం ప్రతీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఓటుహక్కు అనేది ప్రజాస్వామిక దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కు అని అందుబాటులో ఉండి అవకాశాలు ఉండీ వినియోగించుకోలేకపోతే మనిషి జీవచ్ఛవంతో సమానమని వారు పేర్కొంటున్నారు. పార్టీలు, వ్యక్తులపై ఎవరి వ్యక్తిగత అభిప్రాయం, అభిమానం ఎలా ఉన్నా ఓటు విషయానికి వచ్చే సరికి అన్నివర్గాల ప్రజలకు ఏం ప్రయోజనం ఒనగూరుతుందన్న సమదృష్టిలో ఉండాలని పేర్కొంటున్నారు. ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలంటున్నారు. సమాజ శ్రేయస్సుకు ఉపయోగ పడే వారిని గుర్తించి ఓటుహక్కును వినియోగించుకుంటే రాజ్యాంగం కల్పించిన హక్కుకు సార్థకత కలుగుతుందని వారు చెబుతున్నారు.

క్రమం తప్పకుండా ఓటు వేస్తున్నా



మఠంపల్లి సబ్‌స్టేషన్‌లో పనిచేసే సమయంలో విద్యుదాఘాతంతో నడుం కింది భాగం చలనం లేకుండాపోయింది. మరొకరి సాయం లేనిది అడుగు వేయలేను. 20 ఏళ్లుగా అన్ని స్థాయిల్లోని ఎన్నికల్లోనూ క్రమం తప్పకుండా ఓటేస్తున్నా. నా వయస్సు 48 సంవత్సరాలు ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి ప్రమాదానికి ముందు మూడుసార్లు అనంతరం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నా.

- గాయం గోవర్ధన్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు మఠంపల్లి

ప్రతీ ఎన్నికలో ఓటు వేశా



నా వయస్సు 42 ఏళ్లు. ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడు పోలియో కారణంగా వైకల్యం ఏర్పడింది. 18 ఏళ్లు దాటిన తర్వాత ఓటు హక్కు వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతీ ఎన్నికలో నా ఓటు హక్కును వినియోగించుకున్నా. బతుకులను మార్చగలిగే శక్తి ఓటుకు మాత్రమే ఉందని అందరూ గుర్తించాలి.

- అమరారపు సైదులు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు

పోలియో బాధితుడినైనా రాజీపడలేదు



నేను పట్టుకతోనే పోలియో బారినపడ్డా. బీఈడీ చదివిన నేను క్రమం తప్పకుండా ఓటు వేస్తున్నా. ఎక్కడా ఓటు విషయంలో రాజీ పడలేదు. ఎన్ని పనులు ఉన్నా పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వెళ్తా. రాజ్యాంగం కల్పించిన హక్కును సరిగ్గా వినియోగిస్తేనే ప్రజాస్వామ్యం నిలబడుతుంది.

- గాలి సతీష్

అభ్యర్థులతో కరచాలనమూ తప్పే

సంగ్రామం

(ఆంధ్రజ్యోతి-చండూరు): ఎన్నికలు జరిగే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్నట్లు లెక్క. అయితే కొందరు ఉద్యోగులకు తెలియని తనం, అత్యుత్సాహంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండడం చేస్తుంటారు. ఇదీ చాలా పెద్ద తప్పని ఎన్నికల సంఘం చెబుతోంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉద్యోగం ఊడిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తోంది.

కరచాలనం ఎందుకు చేయకూడదు.!

ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలో విధులు నిర్వహిస్తారు. ఉద్యోగులు ఒక అభ్యర్థికి బహిరంగంగా కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండడం ద్వారా ఆ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నారని లేదా అనుకూలంగా ఉన్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. దీంతో ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత సన్నగిల్లే అవకాశం ఉంది.

» ఎన్నికల సమయాల్లో కఠిన నిబంధనలు



ప్రవర్తనా నియమావళి

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ప్రవర్తనా నియమావళి(మోడల్‌కోడ్‌ఆఫ్ కండక్ట్) అమల్లోకి వస్తుంది. ఈ సమయంలో ప్రభుత్వ అధికారులు అభ్యర్థులతో, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవసరమైన సాన్నిహిత్యాన్ని ప్రదర్శించకూడదు.


పరిధి దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవు

ఎన్నికల విధుల్లోని అధికారులు ఎన్నికల నియామావళిని ఉల్లంఘిస్తే శిక్షలు తప్పవు. నిబంధనల తీవ్రతను బట్టి సర్వీస్ రూల్స్ ప్రకారం శాఖాపరమైన విచారణ ఎదుర్కోవాల్సి వస్తుంది. వేతన పెరుగుదల నిలిపివేయడం, పదోన్నతి నిలపివేయడం, కొన్ని సందర్భాల్లో ఉద్యోగం నుంచి తొలగించడం, నిర్బంధ పదవీవిరమణ చేయించడం జరుగుతుంది. అధికారి ఉద్దేశ్యపూర్వకంగా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో జరిమానాలు విధిస్తారు.

ఎలచ్చన్లు ఏడాదికోసారి వస్తే
ఎంత బాగుండో

గ్రామాల్లో పల్లె పోరు తారస్థాయికి చేరింది. మొదటి విడతలో పోలింగ్‌కు ఒక రోజు మాత్రమే మిగిలి ఉండటంతో అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. రెండో విడతలో ప్రచారం సాగుతుండగా, మూడో విడతలో సోమవారం గుర్తుల కేటాయింపు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో పలుగ్రామాల్లో రచ్చబండల వద్ద ఆసక్తికరమైన చర్చలు సాగుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)



యాదయ్య: రామన్నా సర్పంచ్ అభ్యర్థులు జోరుగ ఖర్చు పెడుతుండ్రు. ఇవన్నీ పూడేలా ఆమ్దాని వస్తాదే...

రామయ్య: ఏమొస్తదో ఏమో... మొన్నటి ఎలచ్చన్ల గెలిచిన సర్పంచును అడిగితే ఆమ్దానా, పాడా, అప్పుల పాలయ్యానన్నాడు. ఇదే ఆఖరు. బుద్ధుంటే మళ్లీ పోటీ చేయొద్దన్నాడు.

యాదయ్య: పాతొల్లేమో అలా అంటుంటే, కొత్తోళ్లేమో ఇంతగా ఉరుకులాడు తున్నరేందే...

రామయ్య: ఏమో వాళ్ల ధైర్యమేందో... సర్పంచ్ సాబ్ అనుపించుకోవాలనేమో...

సాంబయ్య: మా ఊరిలో అయితే సర్పంచ్‌కు పోటీ చేసేటోళ్లు రోజూ వంద మందిని పిలిచి రోజుకు రూ.300 కూలి ఇచ్చి ఊళ్లో ప్రచారానికి తిప్పుతున్నరు. కార్యకర్తలకు ఉదయం చాయ్, టిఫిన్, మధ్యాహ్నం మటన్‌తోనో, చికెన్‌తోనో భోజనం, రాత్రి మందు, మళ్లీ భోజనం పెడుతుండ్రు అన్నడు ఆ వూరికి చుట్టం చూపుగా వచ్చిన సాంబయ్య అక్కడికి వచ్చి.

రామయ్య: అయ్యో మా ఊరోళ్లేం తక్కువ తిన్నరా... ఇక్కడ కూడా అదంతా చేస్తుండ్రు. ఒకప్పుడు మనం దండం పెట్టినా సప్పుడు చేయకుండ పోయేటోడు ఇప్పుడు వంగొంగి దండం పెడుతుండు. ఊర్ల జర పెద్దమనిసని ఏదైనా సమస్య చెప్పితే పట్టించుకోనోడు ఇప్పుడు పోటీ చేయగానే అన్నీ చేస్తా, నాదే బాధ్యత అంటుండు.

యాదయ్య: గీ ఎలచ్చన్లు ఐదేళ్ల కోసారి కాకుండా దసరా, సంక్రాంతి పండుగలు వచ్చినట్టు యేడాదికోసారి వస్తే ఎంతో బాగుండునో...కదా...

రామయ్య: ఎలచ్చన్లు యేడాదికోసారి వస్తే పోటీచేసేటోడి కొంపలు ఆరిపోతయ్..అంటూ సెలవిచ్చారు.


జిల్లాలో ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుంటాం



మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

మాడ్గులపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకుంటారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని ధర్మాపురం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటన నడిపిస్తున్నారన్నారు. పేదల కడుపు నింపేందుకే నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించి ఆకలి తీర్చారని అన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రుణాలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు చింతరెడ్డి సైదిరెడ్డి, కొత్త దశరథ పాల్గొన్నారు.

సామాజిక సమీకరణలే కీలకం



(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి) పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు సామాజిక వర్గాల వారీగా మద్దతు కూడగడుతున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలోనే ఓటర్లను సామాజికవర్గాల వారిగా గుర్తించి ప్రధానఅనుచరులతో వారి కులపెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. సమయం చిక్కినప్పుడు అభ్యర్థులు ఫోన్లలో ఆప్యాయంగా పలుకరిస్తూ గెలుపు కోసం సహకరించాలని కోరుతున్నారు. గెలిచిన అనంతరం మీ సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. ఇదిలా ఉండా ఎన్నికల సమయంలోనే సమస్యల పరిష్కారానికి పునాది రాయి పడాలనే ముందుచూపుతో అన్ని సామాజిక వర్గాలు వ్యవహరిస్తున్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికల్లో కులం ఓట్లు కీలకంగా మారుతున్నారు. వార్డుల వారీగా ఎక్కువ ప్రాబల్యం కలిగిన కులం ఓట్లను పరిగణనలోకి తీసుకుంటున్న అభ్యర్థులు ఆ సామాజిక వర్గాలను ఆకట్టుకునేందుకు ఎత్తుకపైఎత్తులు వేస్తున్నారు. ఆయా కుల సంఘాల్లో జిల్లా స్థాయి పదవులు ఉన్నవారిని మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నులయ్యారు.

ఇరువైపులా వారే!

అభ్యర్థులకు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో, ఎవరిని దూరంగా ఉంచాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఓ అభ్యర్థికి మద్దతుగా కనిపిస్తున్న వ్యక్తులు చీకటికాగానే మరో అభ్యర్థికి మద్దతుగా వాడల్లో కలియతిరుగుతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని వారు నమ్మబలుకుతున్నారు. మందు, విందు పార్టీల్లో మునిగి తేలుతున్నారు. వీరిని బుజ్జగించడానికి ఆశావహులు తంటాలు పడుతున్నారు. ఎవరి ప్రచారం వారు సాగిస్తున్నా.. తీరా వీరు చేయిస్తే ఎలా అని అభ్యర్థులు తలలు బాదుకుంటున్నారు. ఏదేమైనా గెలుపునకు ఓట్లు కీలకం కావడంతో ప్రసన్నం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



మాక్‌పోలింగ్‌కు బారులు తీరిన విద్యార్థులు

చండూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మునిసిపాలిటీ కేంద్రంలోని గీతా విద్యాలయంలో విద్యార్థులు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే పోటీదారులుగా, ఓటర్లుగా, ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా వ్యవహరించారు. ఎన్నికల విధానంపై విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పోలోజు నర్సింహాచారి తెలిపారు. ఓటు ప్రాధాన్యం, అభ్యర్థిని ఎన్నుకునే విధానం, ఎన్నికల నియమావళి అంశాలపై వివరించినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి స్వచ్ఛ హరిత పోటీలకు ఎంపిక

● యాదాద్రిభువనగిరి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలు



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన భువనగిరి మండలంలోని వీరారెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్

భువనగిరి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ హరిత విద్యాలయ రాష్ట్రస్థాయి పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలు ఎంపికయ్యాయి. పాఠశాలలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా జాతీయ స్థాయిలో స్వచ్ఛ హరిత విద్యాలయ పోటీలు నిర్వహిస్తోంది. ఈ మేరకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలు పోటీలకు అర్హత సాధించాయి. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచే పాఠశాలలకు ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా రూ.లక్ష నజరానా, అవార్డును కేంద్ర ప్రభుత్వం అందించనుందని డీఈవో కే సత్యనారాయణ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు జిల్లా పాఠశాలలు అర్హత సాధిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంపిక ఇలా..

పలు కేటగిరీలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలకు 819 పాఠశాలలు పోటీపడ్డాయి. కానీ 379 పాఠశాలలు నాలుగు, ఐదు రేటింగ్స్ సాధించాయి. దీంతో 50 మంది స్కూల్ కాంప్లెక్స్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 379 పాఠశాలలను తనిఖీ చేసి ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌తో సరిచూసి కలెక్టర్ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచిన 8 పాఠశాలలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాలలు

రూరల్ -1 (1-8 తరగతులు) కేటగిరిలలో
బీబీనగర్ మండలం మక్తఅనంతారం ప్రాథమికోన్నత పాఠశాల, భువనగిరి మండలం నందనం ప్రాథమికోన్నత పాఠశాల, నారాయణపురం మండలం వాయిల్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల.

రూరల్-2 (9-12 తరగతులు) కేటగిరీలో..
సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం జడ్పీహెచ్ఎస్, తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్, బొమ్మలరామారం మండలం చీకటిమామిడి జడ్పీహెచ్ఎస్

అర్బన్ -1 కేటగిరిలలో
చౌటుప్పల్ మండలం బంగారిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాల.

అర్బన్ -2 కేటగిరీలో..
ఆలేరు మండలం బాలికల ఆశ్రమ పాఠశాల.

తల్లిదండ్రులకు చెప్పుకోలేక..
ఉసురు తీసుకుంది

● పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక డిగ్రీ విద్యార్థిని బలవన్మరణం



శృతి(ఫైల్ ఫొటో)

నల్లగొండ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న తనకు వివాహం చేద్దామన్న తల్లిదండ్రులకు అడ్డుచెప్పలేక కుమార్తె బలవన్మరణానికి పాల్పడింది. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ విషాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మర్రిగూడ మండలం కొట్టాల గ్రామానికి చెందిన బొర్ర నర్సయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండగా, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మొదటి కుమార్తెకు వివాహం చేశారు. రెండో కుమార్తె శృతి(20) నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ రవీంద్రనగర్‌లోని బీసీ వసతిగృహంలో ఉంటోంది. కొంతకాలంగా శృతి తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన తర్వాతే పెళ్లి చేసుకుంటానన్న శృతి పలుమార్లు వివాహం విషయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. రెండు రోజుల కిందట తల్లిదండ్రులు శృతిని కొట్టాల గ్రామానికి పిలిచి మరోసారి పెళ్లి ప్రస్తావన తీసుకురావటంతో తన అభిప్రాయం చెప్పలేదు. స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయాలని తల్లిదండ్రులకు చెప్పిన శృతి సోమవారం నల్లగొండకు చేరుకుంది. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో తాన ఉంటున్న వసతిగృహంలోని స్నానాలగదికి వెళ్లి ఎంతకూ రాకపోవటంతో విద్యార్థినులు ఆందోళనగా అక్కడికి వెళ్లి చూశారు. స్నానాలగదిలో చున్నీతో శృతి ఉరి వేసుకోవడాన్ని గమనించి హాస్టల్ వార్డెన్ సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే శృతి మృతిచెందింది. వివాహం ప్రతిపాదన తీసుకువచ్చామన్న మనస్తాపంతో తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తండ్రి నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ సైదులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్‌లో ఎంపీ చామల తెలుగులో ప్రసంగం



లోకసభలో మాట్లాడుతున్న ఎంపీ చామల

భువనగిరి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం జాతీయగీతం రాసి 150 ఏళ్లు అయిన సందర్భంగా లోకసభలో జరుగుతున్న చర్చలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలుగులో మాట్లాడారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతాన్ని భావితరాలకు తెలియజేసే లక్ష్యంతో జరగాల్సిన చర్చ అందుకు భిన్నంగా సాగుతోందని విమర్శించారు. కేవలం కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలను తిట్టడానికే చర్చ పెట్టినట్టుగా ఉందన్నారు. వందేమాతరం గీతాన్ని మొదటగా 1896లో ఇండియా నేషనల్ కాంగ్రెస్ సమావేశంలో పాడారని అప్పటి నుంచి వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తూనే ఉందన్నారు. కానీ 1937లో దేశ లౌకిక పరిస్థితులకు అనుగుణంగా సమష్టి నిర్ణయంతో గీతంలో చేసిన మార్పులకు తొలి ప్రధాని నెహ్రూను బాధ్యుడిని చేయడం బీజేపి దిగజారుడు విధానమన్నారు.

ఇండిగో విమానాలతో ప్రయాణికుల పాట్లు, దేశ రాజధాని ఢిల్లీలో క్షీణిస్తున్న గాలి నాణ్యత, రూపాయి విలువ పతనం తదితర చర్చించాల్సిన అంశాలెన్నో ఉన్నా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, బెంగాల్ ఎన్నికల దృష్ట్యా వందేమాతరం గీతం అంశం చర్చకు పెట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 2047 రైజింగ్‌లో భాగంగా త్రి ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. దేశంలో డబుల్ ఇంజన్ సర్కారుకు మాత్రమే నిధులు ఇవ్వడం కాదని, అన్ని రాష్ట్రాలకు నిధులు, ప్రాజెక్టులు ఇవ్వాల్సిన బాధ్యతలను మోదీ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు.

తాను మరణిస్తూ మరో నలుగురికి పునర్జన్మ



ప్రశాంత్(ఫైల్)

● అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు

మోటకొండూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లికి చెందిన యువకుడు తాను చనిపోతూ మరో నలుగురికి పునర్జన్మనిచ్చాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాటేపల్లి గ్రామానికి చెందిన పల్లపు మల్లేష్, మహేశ్వరి దంపతుల కుమారుడైన ప్రశాంత్ (27) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ప్రశాంత్‌కు ఆరేళ్లక్రితం వివాహంకాగా, ఇద్దరు కుమార్తెలు, రెండు నెలల కుమారుడు ఉన్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీన పెద్ద నాన్న కుమారుడు అక్షయ్‌తో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో భువనగిరి మండలం రాయగిరి వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో ప్రశాంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. భువనగిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం ప్రశాంత్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు సోమవారం నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ ప్రతినిధులు ప్రశాంత్ భార్య శ్రీజ, తల్లిదండ్రులు మల్లేష్, మహేశ్వరికి అవయవ దానంపై కల్పించడంతో వారు అందుకు అంగీకరించారు. ప్రశాంత్ శరీరం నుంచి రెండు కిడ్నీలు, కాలేయం, గుండెను సేకరించారు. ప్రశాంత్ అవయవాలతో మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అంగీకరించిన కుటుంబ సభ్యులను వైద్యులు, గ్రామస్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో
వార్డు అభ్యర్థి మృతి



సిద్ధయ్య మృతదేహం

గరిడేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో వార్డు స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన జలగం సిద్ధయ్య(45) మంగళవారం సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మండలంలోని గడ్డిపల్లికి వెళ్లి పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి ఎనిమిది గంటల సమయంలో పొనుగోడు గ్రామశివారులోకి రాగానే సూర్యాపేట-గరిడేపల్లి ప్రధానరహదారిపై ముందుగా కల్టివేటర్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. సిద్ధయ్య అప్పన్నపేట గ్రామపంచాయతీ ఎన్నికల్లో 7వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నాడు. ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో సిద్ధయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. సిద్ధయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

భువనగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని బొల్లేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు పన్నీరు శశికుమార్ రోజు వారి మాదిరిగా దూడను కొట్టంలో కట్టేశారు. కుక్కలు దాడి చేసి దూడెను హతమార్చాయి.

కట్ల పాము కలకలం

నార్కట్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారసభలో కట్లపాము కలకలం సృష్టించింది. సభ ముగిసిన అనంతరం కార్యకర్తలు వెళ్తుండగా జనంలోకి పాము దూసుకురావడంతో చెల్లాచెదురయ్యారు. పాము నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు. పాము కూడా ఓ ఆటోలోకి దూరింది. ఆటో అక్కడినుంచి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వీధి కుక్కలను తరిమేందుకు..



భువనగిరి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని పలు బస్తీల లోని ఇళ్ల ముందు ఎరుపు, నీలి తదితర రంగు సీసాలు వేలాడుతున్నాయి. అక్కడ వీధి కుక్కలను తరిమేందుకు స్థానికులు ఇలా కొత్తగా ఆలోచిస్తున్నారు. పట్టణం, పల్లె తేడాలేకుండా ప్రతీ బస్తీని గ్రామసింహాలు రాజ్యమేలుతున్న పరిస్థితి. పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలతో ఆయా ప్రాంతాల ప్రజలు జంకుతున్నారు. రహదారిపై వీధికుక్కల గుంపు ఉందంటే పలువురు వెళ్లే మార్గాన్ని మార్చుకుంటున్నారు. అంతేగాక ఇంటి ఎదుట గేటు లేదా దర్వాజా తీయగానే వాకిట్లో వీధి కుక్కలు అరుస్తూ కనిపిస్తుండటంతో భయంతో వెంటనే తెరిచిన దర్వాజా, గేటును మూసి వేసుకుంటూ ఇంట్లోకి వెళ్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు వీధికుక్కలతో మరింత భయానికి గురవుతున్నారు. బైక్‌పై వెళ్తున్న వారిని కూడా వీధి కుక్కలు వెంటాడుతుండటంతో పలువురు అదుపు తప్పి కింద పడి గాయాలపాలవుతుండటం నిత్యకృత్యమవుతోంది. నిత్యం వీధి కుక్కల దాడిలో చిన్నారులు, మహిళలకు గాయాలు అంటూ వస్తున్న వార్తలు ప్రజలను మరింత భయపెడుతున్నాయి.

నిబంధనల సాకు చూపుతూ..

వీధి కుక్కల సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా నిబంధనల సాకు చూపుతూ తప్పించుకుంటున్నారు. దీంతో ఎవరికి వారు వీధికుక్కల సమస్యను పరిష్కరించుకునే లక్ష్యంతో పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి ముందు పరిసరాల్లో ఉన్న మొక్కలకు రంగు కలిపిన నీళ్లసీసాలు కడితే వీధి కుక్కలు భయపడుతూ ఇంటి దరిదాపుల్లోకి రావడంలేదని ఇటీవల విస్తృతంగా ప్రచారమవుతోంది. ఆ వింత ప్రచారానికి సోషల్ మీడియా తోడవుతున్నది. ఈ మేరకు భువనగిరి పట్టణంలోని పలు బస్తీలలోని ఇళ్ల ముందు ఎరుపు, నీలి తదితర రంగు సీసాలు వేలాడదీస్తున్నారు.

ఓటర్లను బెదిరించినా.. ప్రలోభ పెట్టినా..

ఇక అంతే సంగతి!

● రుజువైతే ఏడాది జైలు శిక్షతోపాటు జరిమాన



ఓటు వజ్రాయుధంలాంటిది. ప్రజాస్వామ్యాన్ని నాలుగు పాదాలపై నడిపించడానికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా, బెదిరించకుండా చట్టం రక్షణ కల్పించింది.

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

ఓటర్లకు డబ్బులు ఇచ్చో, బెదిరించో ఓటు వేయించుకుంటే అభ్యర్థులకు శిక్ష పడేలా చట్టం రూపొందించబడింది. అభ్యర్థి అలా చేశాడని ఎవరైనా ఫిర్యాదు చేసి, రుజువు చేసినప్పుడే శిక్షించబడతారు. చట్టం ఎంత పకడ్బందీగా ఉన్నా ఓటర్లకు డబ్బు, మద్యం పంచడం, ఇతర ప్రలోభాలకు గురి చేయడం, వాటికి లొంగకపోతే బెదిరించడం కూడా చేస్తుంటారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, బెదించినా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023 ప్రకారం జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు. తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తేనే కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే శిక్షలు విధిస్తారు. ఇప్పుడు బెదిరింపులు తగ్గాయిగాని అభ్యర్థులు ఓటర్లకు డబ్బు, మద్యం పంచడం మామూలైంది.

ఓటర్లను ప్రలోభపెట్టడం

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ఇవ్వడం, మద్యం పంచడం, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వడం నేరం. ఎన్నికల్లో ఇలాంటివి జరుగుతున్నట్లు ఎన్నికల అధికారుల దృష్టికి వచ్చినా, తగిన ఆధారాలతో ఎవరైనా ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేసి విచారణ చేస్తారు. నేరం రుజువైతే సెక్షన్ 171బీ కింద ఏడాదిపాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. డబ్బు పంచిన అభ్యర్థితోపాటు ఓటుకు డబ్బులు తీసుకున్న వారికీ శిక్ష విధించే అవకాశాలు ఉన్నాయి.

బెదిరించడమూ నేరమే..

అభ్యర్థులు తమకు అనుకూలంగా ఓటు వేయాలని ఓటర్లను బెదిరించడం... వివిధ రూపాల్లో ఒత్తిడి తేవడం నేరంగా పరిగణిస్తారు. ఇందుకు సెక్షన్ 171సీ కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతారు. నేరం రుజువైతే ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

ప్రత్యర్థిపై తప్పుడు ప్రచారం చేసినా..

ఎన్నికల బరిలో నిలిచిన కొందరు ప్రత్యర్థులపై దుష్ప్రచారాలు చేస్తుంటారు. ఫలితాలను ప్రభావితం చేసేలా ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వివాహేతర సంబంధాలు ఉన్నాయనో, నేరాలు చేశాడనో, కులం, మతం అంటూ తప్పుడు ప్రచారం చేస్తుంటారు. ఇలా ప్రచారం చేయడం కూడా నేరంగానే పరిగణిస్తారు. ఫిర్యాదు చేసి, నిరూపిస్తే తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తికి జరిమానా విధిస్తారు.

దొంగ ఓట్లు వేయడం

పోలింగ్ జరుగుతున్నప్పుడు చనిపోయిన వారి పేరున, ఒకరికి బదులుగా మరొకరు, ఒకసారి ఓటు వేసి మరోసారి ఓటు వేయాలని ప్రయత్నించడం కూడా నేరమే. ఇలాంటి సంఘటనలకు పాల్పడిన వారికి ఏడాది జైలు శిక్ష విధించే అవకాశముంది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా..

ఎన్నికల సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తారు. ఘర్షణపడటం, పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేకుండా చొరబడటం, పోలింగ్ అధికారుల, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, ఇతర నేరాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతారు. నేరాన్ని బట్టి శిక్ష ఉంటుంది.

ఎంజీయూ ఫారెన్ రిలేషన్ డైరెక్టర్‌గా శ్వేత

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫారెన్ రిలేషన్ ఆఫీసర్స్ సంచాలకులుగా అసోసియేట్ ప్రొఫెసర్ సూరం శ్వేతను నియమిస్తూ మంగళవారం రిజిస్ట్రార్ అల్వాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిపాటు డైరెక్టర్‌గా దేశ, విదేశాల్లో విశ్వవిద్యాలయాలు, పరిశోధక సంస్థలను ఎంజీయూతో అనుసంధానం చేస్తూ కొత్త అవకాశాల్లో కీలకంగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా వీసీ ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు అభినందించారు.

ఖోఖోలో బాలికల జట్టు జిల్లా ప్రథమస్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఖోఖో అండర్-19 పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల జట్టు మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఛాంపియన్‌గా నిలిచిన టీమ్ బృందాన్ని ఆర్డీవో అశోక్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా తరఫున ఆడి మొదటి బహుమతి సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ -19 కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5, 6, 7 తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన టీం ప్రతిభ కనబర్చి విజయం సాధించిందన్నారు. అదేవిధంగా ఈ టీంకు సంబంధించిన క్రీడాకారుణులు వైశాలి, చందన, వైష్ణవి, కీర్తన, జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కనగల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తమనయ్య, బీసీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ బైరెడ్డి సంధ్య, టీం కోచ్‌లు అయితగోని విజయ్, పాలోజు నారి, నాగేంద్ర, జాని, మనీష తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు యోగ్యత



భూక్య యోగ్యత

కోదాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ చదరంగం పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థిని భూక్య యోగ్యత ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో పెద్దపల్లి జిల్లాలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొనగా, 6వ తరగతి చదువుతున్న యోగ్యత అండర్-14 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. యోగ్యత జనవరి 13 నుంచి 17 వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

భువనగిరి టౌన్: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు భువనగిరి శ్రీవైష్ణవి జూనియర్ కళాశాలకు చెందిన మరికొండ గణేష్ ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 13 నుంచి 17 వరకు జరుగనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలలో అండర్-17 కేటగిరీలో 1500 మీటర్ల పరుగు పందెంలో తెలంగాణ నుంచి పోటీలో పాల్గొంటారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో గణేష్‌ను కళాశాల ప్రిన్సిపల్ మదిర మల్లేశం, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రావు తదితరులు అభినందించి మెమోంటో అందజేశారు.

పాతగుట్టలోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు

● బస్టాండు, అద్దె గదుల్లో పరిశుభ్రత పాటించాలి ● దేవస్థాన ఈవో వెంకట్రావు



దేవస్థాన సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాతగుట్టలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఈవో ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయం, పాతగుట్టలో మంగళవారం ఈవో పర్యటించి అధికారులకు పలు సూచనలుచేసి మాట్లాడారు. ఈ నెల 30న నిర్వహించబోయే వైకుంఠఏకాదశి వేడుకలు అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తామన్నారు. పాతగుట్ట ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మెట్ల వెంట షెడ్డు పనులను పరిశీలించి నాణ్యతతో చేపట్టాలన్నారు. చలికాలం అయినందున గదుల్లో గ్రీజర్లు తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. మరమ్మతులు, సమస్యల పరిష్కారానికి, ఫిర్యాదుల స్వీకరణకు రిజిస్టర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఈవోలు జూశెట్టి క్రిష్ణ, ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రఘు, జాటోత్ శంకర్‌నాయక్, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ అంజనేయులు, ఎస్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామికి ఆలయంలో అర్చకులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణం నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

మఠంపల్లి,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో స్వామికి మంగళవారం విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయ్యాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణ అనంతరం స్తంభోద్భవుడికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగశాలలో నారసింహ సుదర్శన హోమాలు చేపట్టారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాభోది నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన చేశారు. ఉదయం 9:30గంటలకు లక్ష్మీనృసింహుడి పరిణయ వేడుక ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహులను కల్యాణవేదికపై అధిష్ఠింపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఇంచార్జి ఈఓ అజ్మీర జ్యోతి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా మండల పూజ

నార్కట్‌పల్లి, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం 24వ మహా మండల పడిపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కేరళకు చెందిన ప్రమోద్ గురుస్వామి తంత్రి ఆధ్వర్యంలో పడిపూజాధికాలు నిర్వహించారు. ఆలయ నిర్వహణ, అభివృద్ధికి గురుస్వామి చైర్మన్ బెల్లి వెంకన్న భక్తులను కోరగా దాతలు విరాళాలు ప్రకటించారు. పద్దెనిమిదవ మాలధారణ పూర్తిచేసుకున్న గురుస్వాములు పెండోట సోమయ్య, నానంచర్ల బాలరాజులను ఘనంగా సన్మానించారు.

మొదటి విడత ప్రచారానికి తెర

నార్కట్‌పల్లి, కేతేపల్లి, శాలిగౌరారం, నాంపల్లి, చండూరు రూరల్, మునుగోడు రూరల్, మునుగోడు, డిసెంబరు 9,(ఆంధ్రజ్యోతి): మొదటి విడత ప్రచారానికి తెరపడింది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఆరు రోజులు నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నార్కట్‌పల్లి, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రచారం నిర్వహించారు. శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందు సామేల్ ప్రచారం నిర్వహించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నాంపల్లిలో ప్రచారం నిర్వహించారు. చండూరు మండలంలోని బోడంగిపర్తి, తాస్కానిగూడెంలో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. నార్కట్‌పల్లి, కేతేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రచారం నిర్వహించారు. శాలిగౌరారం మండలం మాదారంలో బీఆర్ఎస్ నాయకుడు మామిడి సర్వయ్య మాట్లాడారు. మునుగోడు మండలంలోని ఎలగలగూడెం సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రచారం నిర్వహించారు. మునుగోడులో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రచారం ముగియడంతో మంగళవారం సాయంత్రం శాలిగౌరారం మండలంలోని వైన్స్‌షాపులను నకిరేకల్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య సీజ్ చేయించారు.

సకాలంలో పౌష్టికాహారం అందించాలి


అంగన్‌వాడీ కేంద్రంలో బియ్యం పరిశీలిస్తున్న సీడీపీవో నిర్మల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సరైన సమయంలో అందించాలని మండల ఐసీడీఎస్ అధికారి నిర్మల అన్నారు. 'తుట్టెలు కట్టిన బియ్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని అన్నెపర్తి, జీకే అన్నారం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లను మంగళవారం పరిశీలించారు. బియ్యం బస్తాలను పరిశీలించి, బియ్యం శుభ్రం చేయించారు. నెలవారీగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే సరుకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందాల్సిన సరుకులు ఇవ్వడంలో కాలయాపన చేయొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేసీఆర్ దీక్షతోనే కదిలిన ఢిల్లీ పీఠం


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ మొక్కవోని దీక్షతో నవంబరు 29 నుంచి అమరణ దీక్ష కొనసాగించడంతో అప్పటి ఢిల్లీ పీఠం కదిలి డిసెంబరు 9వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. విజయ్ దివస్‌ను పురస్కరించుకొని మంగళవారం జిల్లాకేంద్రంలోని బీఆర్. అంబేడ్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు రాష్ట్ర ప్రజల మద్దతుతో రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. వచ్చిన తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా అనేక పథకాలతో సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలె శరణ్యారెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, రాంమోహన్, కొండూరు సత్యనారాయణ, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మారగోని గణేష్, జమాల్ ఖాద్రీ పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

నాంపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాంపల్లి గాంధీజీ పాఠశాల ఎదుట చండూరుకు వెళ్లే రోడ్డు మార్గంలో రహదారి నరకప్రాయంగా మారింది. మండల కేంద్రంలో తారురోడ్లపై బీటీలేచి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచు ఈమార్గంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు అదుపుతప్పి పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని స్థానికులు, వాహనదారులు తెలుపుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దారి దాటేందుకు కష్టాలు

● పొంగుతున్న అన్నెపర్తి గ్రామ కుంట

నల్లగొండ రూరల్, డిసెంబరు 9,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండలంలోని బి. వెల్లెంల ప్రాజెక్టు నుంచి కాల్వ ద్వారా చెరువులకు వస్తున్న నీరు రహదారులపైకి వస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్నెపర్తి గ్రామంలో కాల్వ దాటేందుకు ప్రయాణికులు, విద్యార్థులు అపసోపాలు పడుతున్నారు. గొర్లు, మేకలు దాటించడానికి కాపరులకు ఇబ్బందులు తప్పడంలేదు. అన్నెపర్తి గ్రామ సమీపంలోని కుంట నిండడంతో అలుగు పోస్తోంది. దీంతో కుంట పక్కన ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి రెండు ఫీట్లలో వరద ప్రవహిస్తోంది. ఆ దారివెంట అన్నెపర్తి నుంచి అప్పాజిపేటకు వ్యవసాయ పనులకు వెళ్లేవారు, సమీపంలోని గ్రామాల విద్యార్థులు అన్నెపర్తిలోని పాఠశాలకు వస్తుంటారు. నీటిప్రవాహం ఎక్కువగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం చుట్టూ నీరు చేరింది. దీంతో దేవాలయానికి వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవాలయానికి పక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ నీరు చేరింది. నీటి ప్రవాహం పెరిగితే ట్రాన్స్ ఫార్మర్‌ను తాకి ఆ దారిగుండా వెళ్లే వారికి ప్రమాదం పొంచిఉంది. నీటి ప్రవాహం ఎక్కువైతే రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో కూలీలు, విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొక తప్పదు.






దేవాలయం చుట్టూ చేరిన వరద నీరు

రోడ్డుపై నిలిచిన నీళ్లలో ఇబ్బందులు పడుతూ దాటుతున్న ద్విచక్ర వాహనదారుడు,


ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన నీరు

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

కేతేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ మంగళవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు కొనసాగిన పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో కేతపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధులకు హాజరయ్యే వారు 120మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నెల 11న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ శాఖ ఉద్యోగులు, సిబ్బంది, వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అవకాశం కల్పించింది. ఈ మేరకు గత ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ నమోదు కార్యక్రమం మంగళవారం వరకు మూడు రోజుల పాటు కొనసాగింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఫారం 12, ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకుని పోస్టల్ బ్యాలెట్ పొంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కేతేపల్లి ఎంపీడీవో బి. శ్రీనివాసరావు తెలిపారు.

మండలంలో 70 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

చండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలో మొదటి విడత ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎన్నికల డ్యూటీపై వెళ్లే అధికారులు, ఉద్యోగులకు కల్పించే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఈ నెల 7 నుంచి 9 వరకు వినియోగించుకునే విధంగా అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. మొదటి రోజు 9 మంది, రెండో రోజు 18 మంది, చివరి రోజు 43 మంది తమ ఓట్లను పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేయగా మండలంలో మొత్తం 70 మంది తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారని ఎంపీడీవో యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : ఎంపీడీవో

నార్కట్‌పల్లి, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలో పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీవో కత్తురోజు ఉమేశ్‌చారి తెలిపారు. మొత్తం 29 జీపీలకుగాను రెండు ఏకగ్రీవం కాగా 27 గ్రామ పంచాయతీల్లో 88మంది సర్పంచ్ అభ్యర్థులు, 246 వార్డులకు గాను 538 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని తెలిపారు. 27 జీపీలకు గాను మొత్తం 42,426 మంది ఉండగా వీరిలో 20,821 మంది పురుషులు, స్త్రీ ఓటర్లు 21,604మంది ఉన్నారని తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదేరోజు లెక్కింపు చేసి విజేతలను ప్రకటిస్తామన్నారు. మండలాన్ని 14 రూట్లు, 5 జోన్లుగా విభజించామన్నారు. 652 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 41లోకేషన్‌లలోని 246 పోలింగ్ కేంద్రాల్లో 246 మంది పీవోలు, 327 మంది ఓపీవోలు, 30 మంది స్టేజ్-2 అధికారులు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అక్కెనపల్లి, చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడం, మాండ్ర గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా, అమ్మనబోలు, బీ.వెల్లెంల, నార్కట్‌పల్లిలను అతి సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు ఎంపీడీవో తెలిపారు. అతి సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ సెంటర్‌ల వద్ద వీల్ చైర్లు ఉంటాయన్నారు. తొలుత వార్డుసభ్యుల ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. నార్కట్‌పల్లి మండలంలోని 100 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో ఉమేశ్‌చారి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మద్యం దుకాణాల వద్ద రద్దీ

నల్లగొండ: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మొదటి విడత ఎన్నికలు జరిగే అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి మద్యం దుకాణాలు మూసివేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీస్, ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. మద్యం ప్రియులు మంగళవారం సాయంత్రం వైన్స్‌షాపు వద్ద బారులు తీరారు. 11వ తేదీ సాయంత్రం 5గంటల తర్వాతే మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి.


నల్లగొండ శివారు వైన్స్‌షాపు వద్ద మద్యం తీసుకెళ్తున్న మద్యం ప్రియులు

సోనియాగాంధీతోనే నెరవేరిన తెలంగాణ ఆకాంక్ష

నల్లగొండ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీతోనే నెరవేరిన రాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. మండలం అప్పాజీపేట గ్రామంలో మంగళవారం సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధేనని కొనియాడారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన మంత్రి పదవిని కూడా త్యాగం చేశారని గుర్తుచేశారు. సోనియాగాంధీ కుటుంబం ఎలాంటి పదవినైనా చేపట్టడానికి అవకాశమున్నా పదవులను చేపట్టకుండా త్యాగం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పాజీపేట మాజీ సర్పంచ్ గంగుల సైదులు పాల్గొన్నారు.

మునుగోడు రూరల్: కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని చల్మెడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేమిరెడ్డి బ్రదర్స్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్మెడ కాంగ్రెస్ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.


అప్పాజీపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిట్యాల : యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం చిట్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. స్థానిక కనకదుర్గ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. తెలంగాణ ఇచ్చిన ధీరవనిత సోనియాగాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోకల దేవదాస్, మేడిశెట్టి ఉమాశంకర్, ఇమ్మడి వెంకన్న, ఎస్‌కే ఫరీద్, జంపాల వెంకన్న, జిట్ట రవి, చిత్రగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన పంపకాలు

(5వ పేజీ తరువాయి)

సమాచారం. అదేవిధంగా పోటాపోటీ ఉన్న గ్రామాల్లో కులాల వారీగా, వర్గాల వారీగా మంగళ, బుధవారాల్లో మాంసం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇంటికి కిలో చికెన్‌తో పాటు మద్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. మంగళవారం రాత్రికి లేదా, బుధవారం సాయంత్రానికి పెద్ద నేతల నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని కలుపుకొని పోటాపోటీ ఉన్న గ్రామాల్లో ఓటుకు కనీసం రూ.1,000 నుంచి రూ.2,000 ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. పోటాపోటీ ఉన్న గ్రామాల్లో రూ.3,000 వరకు ఓటుకు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వినికిడి. కొన్ని గ్రామాల్లో ఓటుకు రూ.1,500తో పాటు చీరెలు పంపిణీ చేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. మొత్తంగా ఎన్నికల్లో గతానికి భిన్నంగా ఓటర్లకు నగదు పంపిణీ చేయడంపై ఓవైపు విమర్శలు వస్తున్నా, గెలుపే లక్ష్యంగా అధికార, ప్రతిపక్షాలనే భేదాల్లేకుండా విచ్చలవిడిగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్న పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొంది.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

నల్లగొండ రూరల్, డిసెంబరు 9,(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలన అందరి బాధ్యత అని నల్లగొండ అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్లు బి. వెంకట్రావు, కిషన్ అన్నారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినం సందర్భంగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో నాగార్జున ప్రభుత్వ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవినీతిని నిరోధించడంలో తెలంగాణ పౌరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ వేతనం తీసుకుంటున్న ప్రతి ఉద్యోగి అవినీతి నిరోధక శాఖ పరిధిలోకి వస్తాడన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా విద్యార్థులు, పౌరులు అవినీతి నిరోధకశాఖను సంప్రదించి 1064కు సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, అధ్యాపకులతో కలిసి అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ చిలుముల సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎ. మల్లేశం, వెంకట్‌రెడ్డి, సావిత్రి, శివరాణి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నల్లగొండ డీఎస్పీ కె .శివరాంరెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని యల్లమ్మగూడెం గ్రామంలో కొన్ని రోజులుగా జరుగుతున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెల 11న జరిగే పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల నిబంధనలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ. వి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

నేరస్థులను గుర్తించి బైండోవర్లు నిర్వహించామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. జిల్లాలో 1,141 మందిని బైండోవర్ చేసినట్లు ప్రకటించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 163 సెక్షన్

పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగించేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదని, గ్రామాల్లో ఎక్కడా నలుగురికి మించి గుంపులుగా ఉండకూడదని సూచించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, అగ్గిపెట్టెలు, లైటర్లు తీసుకెళ్లరాదని నిబంధన విధించారు. పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఓటర్లకు తాయిలాలు ఇచ్చేందుకు ఎవరైనా నగదు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు.

గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తా


మహిళా కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న సర్పంచ్ అభ్యర్థి దాసరి జానయ్య

తిప్పర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తనను గెలిపిస్తే గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తానని మండలంలోని జంగారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి దాసరి జానయ్య అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా మంగళవారం మల్లెపల్లివారి గూడెం, జంగారెడ్డిగూడెం గ్రామస్థులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డితో పాటు, గ్రామస్థుల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తానన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీ వంటి పలు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని మల్లెపల్లివారిగూడెంలో తాగునీరు, డ్రైయినేజీ, సీసీరోడ్లను పూర్తిచేస్తానన్నారు. పార్టీలకు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కనగల్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి : సంతోష్


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి వల్లంల సంతోష్‌యాదవ్

మర్రిగూడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని మండలంలోని ఎర్రగండ్లపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి వల్లంల సంతోష్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఎర్రగండ్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజల మధ్య ఉంటూ గ్రామ సమస్యలు తెలుసుకున్నానని వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామంలో అండర్ డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోని నీరు రోడ్లపైకి వస్తుందని, దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అండర్ డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానన్నారు. ఆదర్శ గ్రామంగా మారుస్తానన్నారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్, నాగరాజు, మహేష్, రాజు, సతీష్, నరేష్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 27.0
కనిష్ఠం 15.4

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 10 డిసెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	576.80 (273.8166)	20,167	20,167
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.64 (4.37)	456.82	333.24
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.554 (43.5481)	900	4,400

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.250



మొదటి విడత ఎన్నికలకు
సర్వం సిద్ధం

- ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి
- ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో ముగ్గురు పోలింగ్ సిబ్బంది
- మొదటి దశలో 294 పంచాయతీలు, 2,870 వార్డులు
- 1,680 మందితో పోలీస్ బందోబస్తు
- అన్ని మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు
- నేడు పోలింగ్ కేంద్రాలకు తరలనున్న సిబ్బంది

జిల్లాలో మొదటివిడత పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. 11న తేదీ పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన అధికారులు, ఉద్యోగులను ఇప్పటికే కేటాయించగా, పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. ప్రతీ మండల కేంద్రంలో ఒక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి బుధవారం అక్కడి నుంచే అన్ని పోలింగ్ బూత్‌ల వద్దకు సిబ్బంది, పోలీసులు సహా పోలింగ్ సామగ్రిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పర్యవేక్షించారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

జిల్లాలో నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 14 మండలాల్లోని 294 గ్రామ పంచాయతీలు, 2,870వార్డు స్థానాలకు తొలిదశలో ఈనెల 11న పోలింగ్ జరగనుంది. ప్రతీ పంచాయతీలో ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ అభ్యర్థికి గులాబీ రంగు బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యులకు తెల్లరంగు బ్యాలెట్ పత్రాన్ని నిర్ధారించి అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు ముద్రించి సిద్ధం చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఒక పోలింగ్ అధికారి, మరో ఇద్దరు సహాయ పోలింగ్ అధికారులను నియమించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ముగ్గురు సిబ్బంది విధుల్లో ఉంటారు. గ్రామాల్లోని వీర్ఏలు, గ్రామపంచాయతీ అధికారులు వీరికి సహాయకంగా ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. మొత్తంగా జిల్లాలో మొదటి విడతలో 7,892 మంది పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించారు. వీరితో పాటు మరో 10శాతం మందిని రిజర్వ్‌లో ఉంచారు. ప్రతీ మండలాన్ని ఒక జోన్‌గా మార్చి జోనల్ అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోల నేతృత్వంలో ఈ జోనల్ బృందాలు పోలింగ్‌ను పర్యవేక్షిస్తాయి. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్‌కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణపై మంగళవారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల పరిశీలకురాలు, సీనియర్ ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణఅమిత్, తదితరులు ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే అన్ని గ్రామాల్లో ఎలాంటి అలజడులు, ఘర్షణలు చెలరేగకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు ఎస్పీ శరత్‌చంద్రపవార్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎస్పీతో పాటు, ఒక ఏఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 23మంది సీఐలు, 84మంది ఎస్‌ఐలు, 1,576 మంది కానిస్టేబుళ్లను ఎన్నికల విధులు కేటాయించారు. వీరందరికీ ఎన్నికల విధులపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. జిల్లాలో 442 సమస్యాత్మక గ్రామపంచాయతీలను గుర్తించారు. ఈ ప్రాంతాలలో ప్రతీ పోలింగ్‌స్టేషన్ వద్ద అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్ పార్టీలను అదనంగా నియమించారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు, పాత

మిగతా 8వ పేజీలో...

మూడో విడతలో
38 ఏకగ్రీవం

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత జరిగే దేవరకొండ డివిజన్‌లో మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికాగా, 38 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. మూడో విడత పోలింగ్ ఈనెల 17వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తారు. అదేరోజు ఓట్లను లెక్కించి విజేతను ప్రకటించడంతో పాటు ఉపసర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. దేవరకొండ డివిజన్‌లో మొత్తం 269 సర్పంచ్ స్థానాలకు, 2,206 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవ పంచాయతీలు మినహా మిగిలిన సర్పంచ్ స్థానాలకు, వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. డివిజన్‌లో మొత్తం తొమ్మిది మండలాలు ఉండగా, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గుడిపల్లి మినహా మిగతా ఎనిమిది మండలాల్లో మొత్తం 38 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

మండలం	ఏక్రగీవ పంచాయతీలు
దేవరకొండ	6
చందంపేట	7
నేరడుగొమ్ము	2
డిండి	4
కొండమల్లేపల్లి	7
గుర్రంపోడు	5
ఏపీ.ఏపల్లి	5
చింతపల్లి	2
మొత్తం	38



మొదలైన పంపకాలు

- ముగిసిన ప్రచారం
- కొనసాగుతున్న మద్యం పంపిణీ
- నగదు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- అభ్యర్థుల గెలుపునకు ఆర్థిక సహాయం అందిస్తున్న పెద్దనేతలు



తొలిదశ ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో అధికారిక ప్రచారానికి మంగళవారం సాయంత్రం తెరపడింది. కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ మంగళవారం రాత్రి నుంచే గ్రామాల్లో జోరందుకుంది. అంతేగాక తాయిలాల పంపిణీ సైతం మొదలైంది. ఇప్పటికే గ్రామాల్లో ఓటర్లకు మద్యం పంపిణీ రెండు రోజులుగా సాగుతున్నట్టు వినికిడి.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

గ్రామాల్లో ఇప్పటివరకు జరిగిన ప్రచార సరళికి అనుగుణంగా అభ్యర్థుల పరిస్థితి, ఓటర్ల మనోగతాన్ని అంచనావేసిన కీలక నేతలు మంత్రి, ఎమ్మెల్యేలు, మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేలతో చర్చించి పోల్ మేనేజ్‌మెంట్ ఎలా నిర్వహించాలనే దానిపై కసరత్తు చేశారు. ప్రధానంగా పోటీ బలంగా ఉందని అంచనావేసిన గ్రామాల్లో, అదేవిధంగా పార్టీ నుంచే తిరుగుబాటు అభ్యర్థులు ఉన్న చోట్ల ఎమ్మెల్యేలు, కీలక నేతలు ప్రత్యేకంగా గెలుపు వ్యూహాలు అమలు చేస్తున్నారు. పార్టీ, వర్గం అభ్యర్థులను గెలిపించుకునేందుకు అన్నినియోజకవర్గాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది.

తాయిలాల పంపిణీకి రంగం సిద్ధం

ఉమ్మడి జిల్లాలో మొదటి దశలో జరిగే 589 గ్రామపంచాయతీలు, 5,080 వార్డు స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఈ గ్రామాల్లో మంగళవారం సాయంత్రానికి అధికారికంగా ప్రచారం ముగించారు. అయితే కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ మాత్రం మంగళవారం సాయంత్రం నుంచి మొదలైంది. అధికార కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ మద్దతుదారులు, ఏ పార్టీ మద్దతు లేకుండా బరిలో దిగిన స్వతంత్రులు, కాంగ్రెస్ రెబెల్స్ సైతం పోటాపోటీగా ఖర్చు చేస్తున్నారు. పోటాపోటీ ఉన్న గ్రామాల్లో ఇప్పటికే ఓటర్లకు మూడు దఫాలు, సాధారణ పోటీ ఉన్న చోట్ల రెండు దఫాలుగా మద్యం పంపిణీ జరిగింది. ఓటరుకు క్వార్టర్ విస్కీ లేదా, ఒక బీరు సీసా చొప్పున ఇప్పటికే మూడు దఫాలుగా పంపిణీచేశారు. పోటాపోటీ ఉన్న గ్రామాల్లో రోజూ మద్యం పంపిణీ చేసినట్టు సమాచారం. వలస ఓటర్లను గుర్తించి ఇప్పటికే వారి వద్దకు ప్రతినిధులను పంపి ఓటుకు వచ్చివెళ్లేందుకు వాహన ఖర్చులు, పోలింగ్ రోజున భోజనాల ఖర్చులతో పాటు, ఓటుకు రూ.1,000 వరకు ఇస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా మునుగోడు, నకిరేకల్, ఆలేరు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని వలస ఓటర్లకు ఈ రకమైన తాయిలాలు ఇస్తున్నట్లు...

- మిగతా 8వ పేజీలో...



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాణి కుముదిని, పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేయాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పోలింగ్ రోజున 9, 11, 1 గంటకు పంపించే పోలింగ్ శాతాన్ని సరైన సమయంలో పంపించేందుకు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, ఫలితాలను ఎప్పటికప్పుడు టీపోల్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు మరోసారి సమీక్షించుకోవాలని, పోలింగ్ బృందాలకు అందజేసే ఫారాలు, వెబ్‌కాస్టింగ్, ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఇచ్చే పోలింగ్‌శాతం, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల ప్రచారం ముగింపు, మద్యంపై నిషేధం, గుర్తింపు కార్డులు, తదితర విషయాలను సమీక్షించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలోని రెండు డివిజన్లలో 14 మండలాల్లో మొదటి విడత ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు వివరించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించామని, పోలింగ్ సిబ్బంది, పార్కింగ్, సిబ్బందికి భోజనం, వసతి సౌకర్యాలు అన్నింటినీ ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎక్కడా ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, జే.శ్రీనివాస్, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పూర్తయ్యే వరకు నీటి విడుదల

నల్లగొండ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ కింద యాసంగి పంటలు పూర్తయ్యే వరకు నీరు విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ ఎస్ఈ బద్రు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎమ్మార్పీ కింద హైలెవల్, లోలెవల్ కాల్వలకు ఈ సారి పంటలకు 120 రోజుల పాటు ఆయకట్టు షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. హైలెవల్ కింద 2.20లక్షల ఎకరాలు ఉండగా, లోలెవల్ కింద 45వేల ఎకరాలకు ఈ ఆయకట్టు కింద నీరు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆరు తడి పంటలు వేసుకొని నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. నీటి పారుదల శాఖ అధికారులు కాల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. నీటి విడుదల సమయంలో కాల్వలకు అక్రమంగా గండ్లు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమ్మార్పీ కింద ఆరుతడి పంటలు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ నెల 10 నుంచి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతీ ఉద్యోగి నిబంధనలు పాటించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, ప్రతీ ఉద్యోగి నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సామగ్రి పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతీ కవర్ సీల్, సంతకాలపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. సామగ్రి పంపిణీ సమయంలో అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక డెస్క్‌లు, ఎక్కడా అలసత్వం, అయోమయం తలెత్తకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలింగ్ సిబ్బందికి తాగునీరు, విశ్రాంతి గదులు, వైద్య సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోని కౌంటర్లు, ఎన్నికల సామగ్రి సరఫరా వ్యవస్థ, రిసెప్షన్ రూమ్ కార్యకలాపాలను పరిశీలించారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించిన మూడో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్రా లక్ష్మి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో నిర్వహించారు. నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. చండూరు, చిట్యాల, గట్టుప్పల్, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మర్రిగూడ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, నాంపల్లి, నార్కెట్‌పల్లి, శాలిగౌరారం, తిప్పర్తి మండలాల్లోని 2,870 పోలింగ్ కేంద్రాల్లో మొదటి విడత ఎన్నికలు జరగనున్నాయి. అందుకు పీవో, వోపీవో, రెండో వోపీవో మొత్తం 7,892 మందిని విధులు నిర్వహించే విధంగా ర్యాండమైజేషన్ నిర్వహించారు. అందులో పీవోలు 3,444, వోపీవోలు 4,448 మందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు.



కనగల్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, కనగల్): జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్నికల సామగ్రిని ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూటరీ కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు వరుస క్రమంలో సిబ్బందిని, సామగ్రిని తరలించాలన్నారు. అధికారులు ఓటరు జాబితా, బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ బాక్స్‌లను సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సరఫరా, పార్కింగ్, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు భోజన వసతి కల్పించాలన్నారు. పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్‌లో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నారాయణ్‌అమిత్, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, దుర్గారావు, ఎన్ఐసీ అధికారులు ప్రేమ్, తహసీల్దార్లు కె.పరశురాం, పద్మ, ఎంపీడీవోలు యాకూబ్‌నాయక్, వేదరక్షిత, ఎంఈవో పద్మ, ఎంపీవో సతీష్, తదితరులు ఉన్నారు.

సోనియాగాంధీతోనే తెలంగాణ సాకారం

నల్లగొండ, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల నెరవేర్చి యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ తెలంగాణ ప్రజల హృదయాల్లో దేవతగా నిలిచారని డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్‌నేత అన్నారు. సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం బలిదానం చేసిన ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీల వారసత్వాన్ని నిలబెట్టిన నిజమైన దేశభక్తురాలు సోనియాగాంధీ అని కొనియాడారు. దేశం కోసం, దేశాభివృద్ధి కోసం, ప్రజల కోసం పనిచేస్తున్న సోనియాగాంధీతో పాటు రాహుల్‌గాంధీలను బీజేపీ ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో అధికారంలోకి తీసుకొచ్చి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సన్నబియ్యం, రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రుణమాఫీ, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసి దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బోడ స్వామి, కిన్నెర శ్రీను, అంబటి సోమన్న, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ముంతాజ్ ఆలీ, వెంకటయ్య, రమణయ్య, కన్నరావు, శివ, పరమేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.



సోనియా జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఏర్పాటు

దేవరకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం అంటేనే కేసీఆర్ అని, కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండలో దీక్ష విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 9 తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించిన రోజు అని, కేసీఆర్ నవంబరు 29న చేపట్టిన అమరణ దీక్ష ఫలితమే డిసెంబరు 9నాటి తెలంగాణ ప్రకటన అని అన్నారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి కొట్లాడకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. 24 గంటల విద్యుత్, రైతు బీమా, రైతుబంధు, ఇంటింటికీ భగీరథనీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ దేవరకొండ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, వల్లపురెడ్డి, గాజుల ఆంజనేయులు, ముత్యపురావు, జానిబాబా, రిజ్వాన్, ఖాదర్, లక్ష్మణ్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




దీక్షా విజయ్ దివస్‌లో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రవీంద్రకుమార్

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణకు 71 వసంతాలు

- స్వదేశీ ఇంజనీర్ల కలకు ప్రతిరూపం నాగార్జున సాగర్

దేశంలోనే మానవ నిర్మిత కట్టడాల్లో మొదటిది. రెండు రాష్ట్రాల అన్నపూర్ణ. ఆధునిక దేవాలయంగా ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నేడు 71వ వసంతంలోకి అడుగిడుతోంది. భారతదేశ ఇంజనీర్ల ప్రతిభకు, ప్రజల శ్రమశక్తికి నిదర్శనం ఈ ప్రాజెక్ట్ పనులను నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1955, డిసెంబరు 10న ప్రారంభించారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



సాగర్ డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాటి ప్రధాని నెహ్రూ


కృష్ణా జిల్లా జగ్గయ్యపేట సమీపంలో ముక్త్యాల కోట కృష్ణా నదీకి ఎత్తయిన ప్రాంతంలో ఉంటుంది. అక్కడి నుంచి నదీ ప్రవాహాన్ని వీక్షించవచ్చు. ఓ రోజు నదీ ప్రవాహాన్ని వీక్షిస్తున్న ముక్త్యాల రాజు రాజారామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్ నీరంతా వృథా పోకుండా ఓ ఆనకట్ట కట్టాలని భావించారు. వెంటనే 1908లో కర్నల్ ఎల్లిస్, కర్నల్ సీటీ మార్లింగ్స్ అనే బ్రిటిష్ ఇంజనీర్లను రప్పించారు. విజయవాడ నుంచి 40 మైళ్ల దూరంలోని పులిచింతల వద్ద ఒక ఆనకట్ట నిర్మాణానికి వీలుందని వారు ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చారు. కొంతకాలం తర్వాత పెద్ద ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని రాజావారు భావించి ఆయనే స్వయంగా నల్లమల అడవులలో స్థలసేకరణకు బయలుదేరారు. రాజా వారికి కేఎల్.రావు, వావిలాల గోపాలకృష్ణయ్య, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు సహకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసల తర్వాత ప్రస్తుతం ప్రాజెక్టు కట్టిన ప్రదేశాన్ని కనుగొన్నారు. అక్కడ ప్రాజెక్ట్ నిర్మాణానికి మైసూర్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు నర్సింహయ్యను, ఇంజనీరు గోపాలచార్యులతో రిపోర్టులను చేయించారు. తెలంగాణలో 10 లక్షల ఎకరాలు, ఆంధ్రలో 18లక్షల ఎకరాలు సాగయ్యేలా నివేదిక తయారుచేశారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి మద్రాస్ ప్రభుత్వం అంగీకరించలేదు. శ్రీశైలంపైన కృష్ణా, పెన్నార్ ప్రాజెక్టును నిర్మించి నీటిని మద్రాసుకు తరలించే ప్రయత్నంలో అక్కడి ప్రభుత్వం ఉంది.

ప్రజల నుంచే ఉద్యమం

మద్రాసు ప్రభుత్వం ప్రాజెక్టుకు సమ్మతించకపోవడంతో రాజావారు ప్రజల నుంచి ఉద్యమం తీసుకువచ్చారు. కృష్ణా తీరవాసులు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి దానికి చల్లపల్లి రాజా శివప్రసాద్‌ను అధ్యక్షుడిని చేశారు. అప్పుడు ప్రజలకు తలా పావుల ఇచ్చి కేంద్ర ప్రభుత్వానికి టెలిగ్రామ్స్ పంపారు. ఆ టెలిగ్రామ్స్ అన్ని గదిలో నిండిపోయాయి. దీంతో ఈ విషయంపై వావిలాల గోపాలకృష్ణయ్య ఢిల్లీ వెళ్లి ప్లానింగ్ కమిషన్ మంత్రి గుల్జారీలాల్ నందను కలిసి ఒప్పించడంతో కేంద్ర ప్రభుత్వం ఖోస్లా కమిటీని నియమించింది.

100 ఆర్చీలు.. 60 కార్లు ఏర్పాటు చేసి

ఖోస్లా వస్తున్నాడని తెలుసుకున్న రాజా వారు అప్పుడే విజయవాడ నుంచి 260 మైళ్ల పొడవున 100 ఆర్చీలు పెట్టి స్వాగత ద్వారాలు, 60 కార్లు ఏర్పాటుచేశారు. ఖోస్లా స్థల పరిశీలనకు ఇబ్బందులు లేకుండా తలగుడ్డ అనంతయ్య అనే వ్యక్తి బెల్లకొండపాలెం గ్రామస్థుల సహకారంతో అడవిలో జీపు పోయే దారిని 14 మైళ్లు తయారు చేయించారు. అప్పుడు ఖోస్లా నందికొండ ప్రాంతాన్ని పరిశీలించి ఇది భగవంతుడు మీకు ఇచ్చిన వరం అని ప్రశంసించాడు. ఆ స్థలాన్ని, లోయలను చూసి ఖోస్లా ముగ్ధులై, ప్రాజెక్టుకు అనుకూలంగా నివేదిక ఇచ్చారు. దీన్ని అప్పటి గవర్నర్ త్రివేది నెహ్రూతో చర్చించి ఆమోదించారు. 1954 డిసెంబరు 17న గవర్నర్ నందికొండ ప్రాజెక్టు నిర్మాణ నిర్ణయాన్ని ప్రకటించారు. ఆంధ్ర, హైదరాబాద్ ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణానికి చేతులు కలిపాయి. 1955 డిసెంబరు 10న ప్రాజెక్టుకు అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. 1956లో పనులు ప్రారంభించగా, 1967 ఆగస్టు 4న ప్రధాని ఇందిరాగాంధీ(నిర్మాణం పూర్తికాక ముందే) కాల్వలకు నీటి విడుదల చేశారు. 1974లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది.



ప్రాజెక్ట్ ప్రత్యేకతలు

- భారతదేశం నిర్మించిన మొట్టమొదటి ఆనకట్ట ఇది.
- ప్రపంచంలోని మానవ నిర్మిత జలాశయాల్లో మూడోది.
- అధిక నీటి విడుదల సామర్థ్యం కలిగిన కాల్వల్లో కుడి కాల్వ ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉంది. ఎత్తులో ప్రపంచంలోని ప్రాజెక్టుల్లో సాగర్‌ది ఏడో స్థానం.
- ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రముఖ ఇంజనీర్లు: అలీ నవాజ్ జంగ్, జఫర్ ఆలీ, ఏపీ. రంగనాథస్వామి.
- పరివాహక ప్రాంతం: 83,083 చదరపు మైళ్లు

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com బుధవారం 10 డిసెంబరు 2025

73 క్వింటాళ్ల వేరుశనగ వేలం

డిండి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని విత్తనోత్పత్తి క్షేత్రంలో ఉత్పత్తి చేసిన 73 క్వింటాళ్ల వేరుశనగను అధికారులు మంగళవారం వేలం వేశారు. అత్యధికంగా క్వింటాల్ రూ.6,120 వేలం పాడి డిండి గ్రామానికి చెందిన శ్రీరామ డిగార్గిగేటర్ దక్కించుకుంది. ఈ వేలంలో తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ అధికారులు రాంబాబు, రవీందర్‌రెడ్డి, చుక్కయ్య, వ్యవసాయశాఖ నుంచి కీర్తి, రమణ, శ్రీనివాస్, రామలింగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

నిడమనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నిడమనూరు, వెనిగండ్ల, బంకాపురం గ్రా మాల్లో మంగళవారం పంచాయతీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో ఒక్క ఇల్లు కట్టించలేదని, తమ ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. సమావేశాల్లో నాయకులు అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, మేరెడ్డి శ్రీనివాసరెడ్డి, వల్లభ్‌రెడ్డి, పసుపులేటి సైదయ్యనాయుడు, వెంకట్‌బాబు, వివేక్‌బాబు, చినవీరయ్య, విశ్వనాధుల రమేష్, కుంచం సతీష్, మెరుగు మధు, శేషరాజు దాసు, తుకారాం, శంకర్, వార్డు సభ్యుల అభ్యర్థులు పాల్గొన్నారు.

యాదవులంతా ఏకమవ్వాలి : వైహెచ్‌పీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు రాములు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు సంఘాన్ని బలోపేతానికి యాదవులంతా ఏకమవ్వాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు పిలుపునిచ్చారు. మంగళవారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతితో మమేకమై జీవనం సాగించే సామాజిక వర్గమే యాదవసంఘమన్నారు. గొర్లు కాస్తూ బర్లు మేపుతూ, వ్యవసాయాధారిత పనులు చేసుకునే యాదవులకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందించాల్సిన అవసరముందన్నారు. విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. యాదవులను పార్టీలకు అతీతంగా ఏకం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. కాగా పట్టణానికి వచ్చిన జాతీయ అధ్యక్షునికి సంఘ సభ్యులు ఘన స్వాగతం పలకగా, ప్రముఖ వైద్యురాలు రమాదేవి రాములు మర్యాదపూర్వకంగా కలిశారు కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ముక్కెర అంజిబాబు యాదవ్, డాక్టర్ రమాదేవి, చేగొండి మురళీయాదవ్, వెంకన్న, నాగేశ్వరరావు, లింగరాజు, శ్రీనివాస్, మల్లేష్, లింగయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలి



దేవరకొండలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమసంఘం నేతలు

దేవరకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో మహిళ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం దేవరకొండలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పార్లమెంట్‌లో మహిళా కోట బిల్లు ఆమోదం పొందినందున బీసీ మహిళలకు సబ్ కోటా బిల్లును ఆమోదం తెలిపే విధంగా కేంద్రం చర్య తీసుకోవాలని కోరారు. బీసీ మహిళలకు చట్ట సభల్లో సబ్‌కోటా రిజర్వేషన్లు వచ్చినప్పుడు నిజమైన రాజ్యాధికారం వచ్చినట్లు అవుతుందన్నారు. రాజకీయంగా మహిళలు ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బీసీ సబ్ కోటా బిల్లు అమలు చేసి రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చొల్లేటి భాస్కరచారి, కోటేశ్వర్‌రావు, పున్న వెంకటేష్, భాషచౌహాన్, శ్రీనివాస్, చంద్రమౌళి, శివగౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత నిర్వహణకు సహకరించాలి



కొండమల్లేపల్లి : గుమ్మడవెల్లిలో పోలీసుల కవాతు

కొండమల్లేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని సీఐ నవీన్‌కుమార్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని చింతకుంట్ల, కొర్రతండా, చింతచెట్టుతండా, గుమ్మడవెల్లి గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్ మాటాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రచారం చేసిన, అసత్యాలు ప్రచారం చేసిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు.

● చింతపల్లి : గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలోని కుర్మపల్లి, కిష్టరాయినిపల్లి, ఎం.మల్లేపల్లిలో పోలీసులు కవాతు నిర్వహించారు అక్రమంగా డబ్బులతో పాటు మద్యం తరలించినట్లయితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

కొండమల్లేపల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయమని మాజీ ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి అన్నారు. వెంకటేశ్వర మొబైల్, ఎలక్ట్రానిక్స్ నిర్వాహకులు కూన భానుచందర్ తండ్రి జ్ఞాపకార్థం కేఎంపీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎంతో మంది అత్యవసర సమయాల్లో రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోవాల్సిన పరి స్థితి ఉందని, ఇలాంటి సమయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు అభిన ందనీయమని అన్నారు. ఈ క్యాంప్‌లో హైదరాబాద్‌కు చెందిన మిత్ర బ్లడ్ బ్యాంక్ వారు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పస్నూరి యుగేందర్‌రెడ్డి, ఏరుకొండ రాము, కూన భానుచందర్, అలుగుబెల్లి నాగార్జునరెడ్డి, కొలనుపాక యుగేందర్‌రెడ్డి, భూతరాజు భరత్, కుంభం గిరి, శ్రీనివాసాచారి, సైదులు, నీలం విజయ్‌కుమార్, మనోజ్, రాకేష్, వెంకట్, గణేష్, హరీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బహిష్కరణ

చింతపల్లి డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘడియాగౌరారం గ్రామానికి చెందిన ఉజ్జిని హేమలతానరేందర్‌రావుతో పాటు గణమోని సైదులు,నాగమళ్ల కవిత యాదగిరి కంబాలపల్లి నరేష్ ఉజ్జిని సంతోష్‌రావు, కంబాలపల్లి స్వాతి, యాదయ్యలను కాంగ్రెస్ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగికుల నాగభూషణ్ మంగళవారం తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలు చేస్తుండటంతో వారిని బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలి

● ఎన్నికల విధులపై అధికారులు, సిబ్బందికి శిక్షణ

మిర్యాలగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లోపాల్గొనే అధికారులు ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో శేషగిరిశర్మ సూచించారు. మిర్యాలగూడ కళావేదికలో మంగళవారం రెండో విడత ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులపై గతంలో మాస్టర్ ట్రైనర్‌లతో శిక్షణ ఇప్పించారు. ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను ఎలా వినియోగించాలి, పోలింగ్ ముగిసిన తరువాత ఎలా సీజ్ చేయాలి అనే అంశంపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఫామ్-25, పీవో డైరీ, డిక్లరేషన్‌లను పూరించడం, వాటి ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేటట్లు చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలు జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు గుడిపాటి కోటయ్య, సైదిరెడ్డి, ఎంపీవో రమేష్, మండల పరిషత్ సూపరింటెండెంట్ కరుణాకర్ పాల్గొన్నారు.

● వేములపల్లి : మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో జితేందర్‌రెడ్డి ప్రొసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మా ట్లాడుతూ ఎన్నికల నిబంధనలనుపక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలన్నారు. నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో అధికారులు చేరుకోవాలన్నారు. చెక్‌లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల స మయంలో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా సిబ్బంది విధులను నిర్వహించాల న్నారు. అనంతరం ఎన్నికల ఖర్చులపై పోటీలోని అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనసరించాల్సిన నియమ నిబంధనలపై మాస్టర్ ట్రైనర్లు ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, పీవోలు పాల్గొన్నారు.



పెద్దవూర శిక్షణలో మాట్లాడుతున్న పీడీ రాజ్‌కుమార్

● పెద్దవూర : గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రిసైడింగ్ అధికారులకు మండల స్పెషల్ ఆఫీసర్, పీడీ రాజ్‌కుమార్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ రుమాది పాపిరెడ్డి, మేదర్ దేవేందర్‌ల చేత శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సామాగ్రి తనిఖీ, బ్యాలెట్ బాక్స్‌ల పీలింగ్ అయ్యే విదానం, ఓటు వేసే క్రమంలో ఎదురయేయ వివిధ సందర్భాలను, ఛాలెంజ్ ఓట్, టెండర్ ఓట్, ఏజ్ ఓట్, బ్లైండ్ ఓటర్స్, వివిధ రకాలైన ఫారాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, నోడల్ ఆఫీసర్ తరి రాము, పంకజ్‌రెడ్డి పాల్గొన్నారు.



మిర్యాలగూడ శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరి శర్మ

దేవరకొండ డివిజన్‌లో 38 సర్పంచ్‌లు ఏకగ్రీవం



చిన్నఅడిశర్లపల్లి – పి.వెంకటయ్య; ఆంగోతుతండా – ఏ. సుగుణసుక్య; రామునిగుండ్లతండా – ఆర్. సంగీత; జానిగానితండా – ఆర్. అలివేలు; గాజినగర్ – వెంకటయ్య; దేవరోనితండా – సరిత; ఫకీర్‌పురం – జువ్వ నాగమణి

దేవరకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడో విడత ఈనెల 17న జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకుసర్పంచ్, వార్డు అభ్యర్థులను ప్రకటించారు. డివిజన్‌లో 9 మండలాల్లో 269 గ్రామపంచాయతీలకు 2,206 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే మంగళ వారం సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో దేవరకొండ డివిజన్‌లో 38 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు. దేవరకొండ మండలంలో 6 గ్రామపంచాయతీలు, చందంపేట మండలంలో 7 గ్రామ పంచాయతీలు, డిండి మండలంలో 4 గ్రామపంచాయతీలు, నేరేడుగొమ్ము మండలంలో 2 గ్రామపంచాయతీలు, కొండమల్లేపల్లి మండలంలో 7 గ్రామపంచాయతీలు, పీఏపల్లి మండలంలో 5, చింతపల్లి మండలంలో 2, గుర్రంపోడు మండలంలో 5 మొత్తం 38 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

సూర్యతండాలో సర్పంచ్ ఏకగ్రీవం

మండలంలోని సూర్యతండాసర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన నేనావత్ కవిత లచ్చిరాం ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏక గ్రీవమైంది. సూర్య తండాలో 8వార్డులు ఏకగ్రీవమయ్యాయి. , సూర్యతండా ఎమ్మెల్యే బాలు నాయక్ స్వగ్రామం.

కొండమల్లేపల్లిలో 7 పంచాయతీలు

కొండమల్లేపల్లి : మండలంలోని 27 గ్రామపంచాయతీలకు నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా 20 గ్రామపంచాయతీలకు 71 మంది బరిలో ఉన్నారు. అలాగే మండలంలోని మొత్తం 216 వార్డు మెంబర్లకు గాను 102 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 114 వార్డుల్లో 378 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎంపీడీవో స్వర్ణలత తెలిపారు. ఏడు గ్రామపంచాయతీలకు ఒకే అభ్యర్థి ఉండడంతో ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఏకగ్రీవమైన పంచాయతీలు చిన్నఅడిశర్లపల్లి సర్పంచ్‌గా పందుల వెంకటయ్య(కాంగ్రెస్), ఆంగోతుతండా సర్పంచ్‌గా ఆంగోతు సుగుణ సుక్య(కాంగ్రెస్), రామునిగుండ్లతండా సర్పంచ్‌గా రమావత్ సంగీత(కాంగ్రెస్), దేవరోనితండా సర్పంచ్‌గా ఇస్లావత్ సరిత(కాంగ్రెస్),జానిగానితండా సర్పంచ్‌గా రమావత్ అలవేలు(కాంగ్రెస్), గాజినగర్ సర్పంచ్‌గా బుడిగపాక పార్వతమ్మవెంకటయ్య(కాంగ్రెస్), ఫకీర్‌పురం సర్పంచ్‌గా జువ్వ నాగమణి సత్తయ్య(కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుర్రంపోడు మండలంలో 5 పంచాయతీలు

గుర్రంపోడు :మండలంలోని 30 పంచాయతీలకు 5 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ములకలపల్లి సర్పంచ్‌గా బొడ్డుపల్లి లింగస్వామి, ఎలమోనిగూడెం సర్పంచ్‌గా వాడపల్లి వెంకన్న, కట్టవారిగూడెం సర్పంచ్‌గా చాడ ప్రమీల చక్రవర్తి, బుడ్డరెడ్డిగూడెం సర్పంచ్‌గా సింగం బాలకృష్ణ, మహిలపురం సర్పంచ్‌గా కట్ట వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఏకగ్రీవంగా సర్పంచ్‌లు ఎన్నికైన గ్రామాల్లో మైలాపురంలో 4 వార్డులకు, కట్టవారిగూడెంలో 1 వార్డుకు పోటీలో అభర్థులు ఉన్నారు. మి గతా ఏకగ్రీవ సర్పంచ్‌ల గ్రామాల్లో వార్డులు ఏకగ్రీవమయ్యాయి.



ములకలపల్లి – బొడ్డుపల్లి లింగస్వామి; ఎలమోనిగూడెం – వి. వెంకన్న; బుడ్డరెడ్డిగూడెం – ఎస్. బాలకృష్ణ; కట్టవారిగూడెం – ప్రమీలాచక్రవర్తి; మహిలాపురం – కట్ట వెంకట్‌రెడ్డి

పీఏపల్లి మండలంలో 5 పంచాయతీలు



పోతిరెడ్డిపల్లి – టి.సత్తమ్మానాగయ్య; బాలాజీనగర్ – మేగావత్ కిషన్; మాదారిగూడెం – రాగం అంజయ్య



పుట్టంగండి – ఎం. రామా; నక్కలపెంటతండా – విమలాస్వామి

పెద్దఅడిశర్లపల్లి, : మండలంలో 25 గ్రామ పం చాయతీలు ఉండగా 5పంచాయతీలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. పోతిరెడ్డిపల్లి సర్పంచ్ - తూటిపల్లి సత్తమ్మనాగయ్య, బాలాజీనగర్ సర్పంచ్- మేగావత్ కిషన్ నాయక్ ,మాదారిగూడెం సర్పంచ్ - రాగం అంజయ్య, పుట్టంగండి సర్పంచ్ - మూడవత్ రామా, నక్కలపెంటతండా -జటావత్ విమలస్వామి. మిగిలిన 20 గ్రామ పంచాయతీలకు యథా విధిగా ఎన్నికలు సాగనున్నాయి.

డిండిలో 3 పంచాయతీలు



రత్నతండా – విజయ; నగరదుబ్బతండా – కే.శిరీష; కొత్తతండా – 00

డిండి :మండలంలో 39 పంచాయతీలు ఉండగా మూడు సర్పంచ్ స్థానాలు, 69 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రత్నతండా సర్పంచ్‌గా సపావట్ విజయ(కాంగ్రెస్), నగరదుబ్బతండా సర్పంచ్‌గా కరంటోతు శిరీష(కాంగ్రెస్), కొత్తతండా సర్పంచ్‌గా పాత్లావత్‌నందునాయక్(కాంగ్రెస్) ఏకగ్రీవ మ య్యారు. ఇప్పటికే గదరాలతండా ఏకగ్రీవం కాగా మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ తరువాత మూడు సర్పంచ్ స్థానాలు 326 వార్డులకు 69 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

నేరేడుగొమ్ములో 2 పంచాయతీలు



మొసంగడ్డతండా – బానవత్ రవి; పలుగుతండా – నేనావత్ అలివేలు

నేరేడుగొమ్ము : మండలంలో 21 పంచాయతీలకు 2 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 19 గ్రామ పంచాయతీల 134 మంది పంచాయతీ బరిలో తలపడుతున్నారు. ఏకగ్రీవమైన పంచాయతీలు మొసం గడ్డతండా- బానవత్ రవి, పలుగు తండా- నేనావత్ అలివేలు ఎన్నికయ్యారు

స్వరాష్ట్ర సాధనకు ప్రాణత్యాగానికి వెరవని కేసీఆర్

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్ర సాధనకు ప్రాణత్యాగానికి వెరవకుండా గట్టి దీక్ష బూనిన కేసీఆర్ జాతి యుగపురుషుడని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. విజయ్ దివస్ సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్‌కార్యాలయంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పదం ఉచ్ఛరించడమే నేరమైన కాలంలో తెలంగాణ పల్లెపల్లె తిరిగి ప్రజల గుండెతట్టి మలిదశ పోరును హోరెత్తించాడని అన్నారు. కేసీఆర్ దీక్షకు బెదిరిన అప్పటి యూపీఏ ప్రభుత్వం డిసెంబరు 9న పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని తెలంగాణ ప్రజలువిజయ్‌దివస్‌గా జరుపుకుంటున్నారని అన్నారు. అనంతరం కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, జడ్పీ మాజీ ఆప్షన్ సభ్యుడు ఎండీ. మోసిన్‌అలీ, అన్నభీమోజు నాగార్జునాచారి, రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ, మగ్దుం పాషా, ఇలి యాస్, మాజీద్, షెహనాజ్ బేగం, , పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండీ. షోయబ్, పిన్నబోయిన శ్రీనివాసరావు, తిరందాసు విష్ణు, పెండ్యాల పద్మ, కోదాటి రమ, ధనమ్మ పాలుట్ల బాబయ్య, పందిరి వేణు, పద్మశెట్టి కోటేశ్వరారవు, యర్రమల్ల దినేశ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నిరుపయోగంగా చేతిపంపులు



బోడపాడులో మరమ్మతుకు నోచని చేతిపంప

గుర్రంపోడు మండలంలోని బోడపాడు, బుడ్డారెడ్డిగూడెం, కొప్పోలు దేవాలయం, హరిజనపురం వద్ద ఉన్న చేతిపంపులు నిరుపయోగంగా మారాయి. ఏడాది క్రితం చెడిపోయిన చేతిపంపులకు నేటి వరకు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వృథాగా మారాయి. కొప్పోలు గ్రా మంలోని శివాలయం వద్ద ఉన్న చేతిపంపు ద్వారా సుమారు 20 గృహాలతోపాటు ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగపడేది. బోడపాడు ప్రా థమిక పాఠశాల ఎదుట ఉన్న చేతిపంపు మరమ్మతులకు నోచుకోక కంపచెట్లతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది. బుడ్డరెడ్డిగూడెం పాఠశాల ఎదుట నిరుపయోగంగా ఉంది. ఈ చేతిపంపులకు తక్షణమే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి- గుర్రంపోడు)

వైభవంగా పెద్ద దర్గా ఉర్సు

దేవరకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణ శివారు కొండమల్లేపల్లి రోడ్డులో హజ్రత్ ఖాదర్ షావలీ పెద్ద దర్గా ఉర్సు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంతోపాటు హైదరాబాద్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉర్సు ఉత్సవాలకు భక్తులు రావడంతో రద్దీ పెరిగింది. గత 200 ఏళ్లుగా డిండి మండలం ఎర్రారం గ్రామానికి చెందిన ముతావల్లీలు ఉర్సు నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి వరకు ఉర్సు కొనసాగనుంది. ఉత్సవాల్లో కొబ్బరికాయలు, పూజ సామాగ్రి, తినుబండరాల విక్రయ దుకాణాలు వెలిశాయి. భక్తులు దర్గాను సందర్శించి ఆనందోత్సవాలతో మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వరకు హైదరాబాద్ కళాకారులచే కవాలి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అబ్దుల్‌ఖాదర్, ఫయజొద్దీన్, మహమ్మద్ రఫి తెలిపారు. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

ఉర్సు వద్ద భక్తుల రద్దీ



పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

● మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ కోరారు. స్థానిక కార్యాలయంలోమంగళవారం మాట్లాడుతూ పరిసరాలు, మురుగు కాల్వలలో చెత్త వేయరాదని, తడి, పొడ చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బంది అందజేయాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పట్టణ స్థాయి బాలల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, శిశు విక్రయాలు, అక్షరాస్యత, మత్తు పదార్థాల నిషేధం తదితర అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామ పరిపాలన అధికారుల సంఘం కార్యవర్గం

పెద్దవూర, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల గ్రామ పరిపాలన అధికారుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడిగా కె.రాము, ప్రధాన కార్యదర్శిగా చిట్టిమళ్ల జ్యోతిలతోపాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఎన్నికల అధికారిగా గిర్దావర్ దండ శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో కోశాధికారి బూతం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తంగిరాల గిరి, రామస్వామి, మద్దెల పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన పంపకాలు

(5వపేజీ తరువాయి)

సమాచారం. అదేవిధంగా పోటాపోటీ ఉన్న గ్రామాల్లో కులాల వారీగా, వర్గాల వారీగా మంగళ, బుధవారాల్లో మాంసం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇంటికి కిలో చికెన్‌తో పాటు మద్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మంగళవారం రాత్రికి లేదా, బుధవారం సాయంత్రానికి పెద్ద నేతల నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని కలుపుకొని పోటాపోటీ ఉన్న గ్రామాల్లో ఓటుకు కనీసం రూ.1,000 నుంచి రూ.2,000 ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. పోటాపోటీ ఉన్న గ్రామాల్లో రూ.3,000 వరకు ఓటుకు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వినికిడి. కొన్ని గ్రామాల్లో ఓటుకు రూ.1,500తో పాటు చీరెలు పంపిణీ చేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. మొత్తంగా ఎన్నికల్లో గతానికి భిన్నంగా ఓటర్లకు నగదు పంపిణీ చేయడంపై ఓవైపు విమర్శలు వస్తున్నా, గెలుపే లక్ష్యంగా అధికార, ప్రతిపక్షాలనే భేదాల్లేకుండా విచ్చలవిడిగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్న పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొంది.

ఎన్నికలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

నేరస్థులను గుర్తించి బైండోవర్లు నిర్వహించామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. జిల్లాలో 1,141 మందిని బైండోవర్ చేసినట్లు ప్రకటించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 163 సెక్షన్

పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగించేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదని, గ్రామాల్లో ఎక్కడా నలుగురికి మించి గుంపులుగా ఉండకూడదని సూచించారు. పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఓటర్లకు తాయిలాలు ఇచ్చేందుకు ఎవరైనా నగదు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు.